అవినీతిమయం!

డీఈవో కార్యాలయంపై తీవ్ర ఆరోపణలు

కాంట్రాక్టు ఉద్యోగిని సీసీగా పెట్టుకుని వసూళ్ల పర్వానికి తెర!

డీఈవో కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇప్పటి వరకు డీఈవోగా పనిచేసిన రామారావు ఓ కాంట్రాక్టు ఉద్యోగిని సీసీగా పెట్టుకుని వసూళ్ల పర్వం కొనసాగించినట్టు ఆరోపణలు ఉన్నాయి. బిషప్ అజరయ్య పాఠశాలలో టీచర్ పోస్టుల భర్తీ దగ్గర నుంచి ఓపెన్ స్కూల్స్ పరీక్షల విభాగం వరకు అన్నింటా ధనకార్యాలే నిర్వహించినట్టు విమర్శలు వచ్చాయి. కార్యాలయంలో పాలన గాడి తప్పిందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నూతన డీఈవో అయినా చక్కదిద్దాలని కోరుతున్నారు.

6

- బిషప్ అజరయ్య పాఠశాలలో టీచర్ పోస్టుల భర్తీలోనూ చేతివాటం!
- ఓపెన్ స్కూల్స్ పరీక్షల విభాగంలోనూ మామూళ్లే!
- డీఈవో పీవీజే రామారావుపై పలు ఆరోపణలు.. పల్నాడు జిల్లాకు బదిలీ
- నూతన డీఈవోగా యూవీ సుబ్బారావు



డీఈవో కార్యాలయం



బదిలీ అయిన డీఈవో పీవీజే రామారావు



నూతన డీఈవో యూవీ సుబ్బారావు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావును పల్నాడు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లా డీఈవోగా పనిచేస్తున్న యూవీ సుబ్బారావును కృష్ణా డీఈవోగా నియమించింది. గతంలో యూవీ సుబ్బారావు చాలాకాలం పాటు మచిలీపట్నం డీవైఈవోగా పనిచేశారు. డీఈవోగా పీవీజే రామారావు పనిచేసిన కాలంలో డీఈవో కార్యాలయంలో పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయన బదిలీ కావడంతో నూతనంగా వచ్చే డీఈవో అయినా ఈ కార్యాలయంలో పరిపాలనను గాడిలో పెట్టాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

టీచర్ పోస్టుల నియామకంలోనూ..

విజయవాడలోని బిషప్ అజరయ్య ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఇటీవల కాలంలో ఐదు టీచర్ పోస్టులను ప్రభుత్వ అనుమతితో భర్తీ చేశారు. ఈ పోస్టుల నియామకంలో ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో పరిపాలనను చూసేది తానే అని చెప్పి కృష్ణా డీఈవో ఒక్కో పోస్టుకు లక్షలాది రూపాయలు వసూలు చేసిన అంశంపై జిల్లావ్యాప్తంగా చర్చ జరిగింది. టీచర్‌లుగా పనిచేస్తూ దీర్ఘకాలిక సెలవుపై విదేశాలకు వెళ్లే ఉపాధ్యాయులకు అనుమతులు ఇచ్చేందుకు, తిరిగి వచ్చిన వారిని మళ్లీ విధుల్లో చేర్చుకునేందుకు ఇంతరేటని నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడ్డారనే విమర్శలు ఎదుర్కొన్నారు. పెడన మండలం కొంకేపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక టీచర్ పిల్లలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై డీఈవోకు ఫిర్యాదు చేసినా సదరు టీచర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నామమాత్రంగా నోటీసు జారీ చేసి విషయాన్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలు డీఈవో ఎదుర్కొన్నారు.

కొత్త డీఈవో రాకతోనైనా మార్పు వచ్చేనా!

గత 15 నెలలుగా డీఈవో కార్యాలయంలో పాలన గాడితప్పింది. గతంలో మచిలీపట్నం డీవైఈవోగా పనిచేసిన యూవీ సుబ్బారావుకు డీఈవో కార్యాయలంలో ఏం జరుగుతుందో కొంతమేర అవగాహన ఉంది. ప్రస్తుతం ఆయన డీఈవోగా వస్తుండటంతో కార్యాలయంలో పాలనను గాడిలో పెట్టేందుకు ఎంతమేర కృషి చేస్తారనేది వేచిచూడాలి.

ధనార్జనే ధ్యేయంగా..

డీఈవోగా పీవీజే రామారావు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి డీఈవో కార్యాలయ పనితీరుపై పలు ఆరోపణలు వచ్చాయి. కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే ఉద్యోగిని క్యాంప్ క్లర్క్(సీసీ)గా పెట్టుకుని అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. టీచర్‌లకు సర్వీస్ మేటర్‌లకు సంబంధించిన వ్యవహారాల్లో మిగతా 6లో..

ఇంటి పన్ను పేరు మార్పుపై

చర్యలు తీసుకుంటాం

ఉన్నతాధికారుల దృష్టికి విషయం

- ఆదేశాలు రాగానే అమలు చేస్తాం
- మున్సిపల్ కమిషనర్ మనోహర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుడివాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను పేరు మార్పు వ్యవహారంలో సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. ఈ విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి మిగతా 6లో..



ఆగని మ్యుటేషన్ మాయ!

గుడివాడ మున్సిపాల్టీ పేరుతో తాజాగా పేరు మార్పు సర్టిఫికెట్ జారీ


ఆటో మ్యుటేషన్ సులభతరం

రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రజల సౌలభ్యం కోసం ఆటో మ్యుటేషన్ (రిజిస్ట్రేషన్ సమయంలోనే ఇంటి పన్ను పేరు మార్పు) ప్రవేశపెట్టడం జరిగిందని కమిషనర్ తెలిపారు. గుడివాడ మున్సిపల్ పరిధిలోని ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరిగే సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు ఇంటిపన్ను పేరు మార్పునకు సంబంధించిన మ్యుటేషన్ ఫీజు కూడా చెల్లించాలని పేర్కొన్నారు. దీంతో పురపాలక సంఘ రికార్డుల్లో ఒకేసారి రెండు పనులు అవుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి పన్ను అసెస్మెంట్ నెంబరును విధిగా రిజిస్టర్ కార్యాలయంలో తెలియజేయాలని తెలిపారు. ఒకవేళ అసెస్మెంట్ నెంబరు ఇవ్వని పక్షంలో సదరు రిజిస్ట్రేషన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు అవుతుందని స్పష్టం చేశారు.

హడలెత్తిస్తున్న హెచ్‌ఐవీ

- ఉయ్యూరు, అవనిగడ్డ, గుడివాడ కేంద్రాల్లో కేసుల ప్రభావం
- ప్రత్యేక కార్యచరణతోనే వ్యాధి వ్యాప్తికి కట్టడి
- నిర్ధారణ పరీక్షల సంఖ్య మరింత పెరగాలి
- ఉమ్మడి జిల్లాల్లో 450కి పైగా హెచ్‌ఐవీ మరణాలు

8



పేదల పాలిట సంజీవని

- కూచిపూడిలో సిలికానాంధ్ర ప్రజావైద్యశాల
- ఇక్కడ డబ్బు చూడరు.. జబ్బు చూస్తారు
- కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు
- మందులు, రోగ నిర్ధారణ పరీక్షల్లో 50 శాతం రాయితీ
- గర్భిణులకు పూర్తిగా ఉచితం
- గ్రామీణులకు కార్పొరేట్ వైద్యసేవలు
- సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కూచిభొట్ల ఆనంద్ చొరవతో సాకారం



6

పెనమలూరు అభివృద్ధికి చర్యలు

- అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

8

కుటుంబవ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాలి

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి జవహర్

6

భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు భేష్

- అధికారులతో కలిసి పరిశీలించిన హోంమంత్రి అనిత



చిమ్మచీకట్లో ప్రయాణం

- అంధకారంలో ముస్తాబాద రోడ్డు
- ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి గ్రామం వరకు జాడలేని వీధి దీపాలు

8

- గ్రేటర్ విజయవాడను దాటి మరీ విస్తరించిన పరిధి..
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో సగం ప్రాంతాలకు సిటీ ఆర్టీసీ బస్సుల ఆపరేషన్
- నగర శివారులో విస్తరిస్తున్న ప్రాంతాలకు అనుగుణంగా కొత్త రూట్లలో నడపలేని దుస్థితి
- స్త్రీ శక్తి పథకంతో పెరిగిన మహిళల ప్రయాణాలు.. బస్సులపై ఓవర్ లోడ్
- పక్కనపడేసిన 100 సూపర్ లగ్జరీ బస్సులను సిటీ బస్సులుగా కన్వర్షన్
- పాతవి కావడంతో ఎక్కడికక్కడ ఆగిపోతున్న బస్సులు

అరకొరే..

విజయవాడలో వేధిస్తున్న బస్సుల కొరత

ఏడాది కిందట వరకు 500 సిటీ సర్వీసులు

స్ర్కాప్‌కు పోగా.. ప్రస్తుతం మిగిలినవి 374 బస్సులే..

సిటీ బస్సుల సంఖ్య ఇలా

డిపో	సిటీ ఆర్డినరీ	మెట్రో ఎక్స్‌ప్రెస్	మొత్తం సిటీ బస్సులు
గవర్నర్ పేట -1	48	19	67
ఇబ్రహీంపట్నం	33	22	55
గవర్నర్ పేట	31	54	85
విద్యాధరపురం	73	14	87
ఉయ్యూరు/గన్నవరం	69	11	80
మొత్తం	254	120	374



బస్సు మొరాయించడంతో రోడ్డుపై ప్రయాణికుల అవస్థలు(ఫైల్)

ఆంధ్రజ్యోతి పరిశీలన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడ సబర్బన్ పరిధిలో సిటీ బస్సుల కొరత వేధిస్తోంది. సబర్బన్ డిపోల పరిధిలో నడిచే సిటీ బస్సులన్నీ ఇప్పటికే కాలం తీరిపోయాయి. ప్రస్తుతం డొక్కుబస్సులనే నడపాల్సి వస్తోంది. కొత్త బస్సులు సమకూరక పోవటంతో భవిష్యత్తును తలచుకుంటే ఆందోళన కలిగిస్తోంది. విజయవాడ సిటీ సబర్బన్ పరిధిలో ఉన్న మొత్తం బస్సులతో పోల్చుకుంటే వందకుపైగా బస్సులు తగ్గిపోయాయి. ప్రస్తుతం ఉన్న పాత రూట్ల రీత్యా ఈ బస్సులు చాలకపోవటంతో గత అర్థ సంవత్సర మిగతా 6లో..

విజయవాడ నగరంలో ఆర్టీసీ వింత పరిస్థితిని ఎదుర్కొంటోంది. గతేడాది వరకు ఉన్న 500 సిటీ సర్వీసుల్లో స్ర్కాప్‌కు పోగా, ప్రస్తుతం 374 బస్సులే మిగిలాయి. సబర్బన్ పరిధి చూస్తే గ్రేటర్ విజయవాడను దాటి మరీ విస్తరించి ఉంది. దీనికి తోడు కొత్తగా విస్తరిస్తున్న కాలనీలకు బస్సులు తిప్పలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాడి పక్కన పెట్టేసిన ఓ 100 సూపర్ లగ్జరీ బస్సులను సిటీ బస్సులుగా కన్వర్షన్ చేసి తిప్పుతున్నారు. అప్పటికే అవి అరిగిపోయి ఉండటం, మహిళల ప్రయాణంతో ఓవర్ లోడు పడటంతో ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి.

వైద్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో పేద, మధ్య తరగతి వర్గాలకు ఓ వరమైంది.. రోగుల జేబులు ఎంత దండిగా ఉన్నాయో చూసే నేటి కార్పో'రేటు' వైద్యానికి పూర్తి భిన్నంగా.. రోగి వద్ద డబ్బులున్నా లేకున్నా.. జబ్బునే చూసే ఆసుపత్రి.. పేద, మధ్య తరగతి వర్గాలకు సేవ చేయాలనే సదాశయంతో ఈ ఆసుపత్రి పనిచేస్తుంది. గర్భిణులకు పూర్తి ఉచితంగా.. పేదలకు 50శాతం రాయితీతో వైద్యం అందిస్తూ సేవాతత్పరతను చాటుతోంది. కృష్ణాజిల్లా కూచిపూడిలోని సిలికానాంధ్ర వైద్యశాల 'సంజీవని' రోగులకు ఎంతో సాంత్వన కలిగిస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రులకు తీసిపోకుండా.. ఉచితంగా, అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తోంది.. ఈ ఆసుపత్రి గురించి తెలుసుకుందాం..





వైద్యసేవల కోసం వచ్చిన రోగులు, ఇన్ పేషెంట్లు



అధునిక పరికరాలతో ల్యాబ్

పేదల పాలిట సంజీవని



రవి ప్రకాష్ సిలికానాంధ్ర వైద్యశాల

(ఆంధ్రజ్యోతి, కూచిపూడి)

గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో సిలికానాంధ్ర సంస్థ దాతల సహకారంతో కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడిలో స్థాపించిన 'సిలికానాంధ్ర వైద్యశాల' పేదలకు వరంగా మారింది. వైద్యం ఖరీదైన ఈ రోజుల్లో సేవా దృక్పథంతో వైద్యసేవలు అందిస్తూ పలువురి మన్ననలు అందుకుంటోంది 'సంజీవని'. రోగులకు ఓపీ ఫీజు లేకుండా రోగ నిర్ధారణ పరీక్షల్లో 50 శాతం, మందుల కొనుగోలులో 50

- ఇక్కడ డబ్బు చూడరు.. జబ్బు చూస్తారు
- కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు
- మందులు, రోగ నిర్ధారణ పరీక్షల్లో 50 శాతం రాయితీ
- గర్భిణులకు పూర్తిగా ఉచితం
- కూచిపూడిలో సిలికానాంధ్ర ప్రజా వైద్యశాల
- గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవల సంకల్పం
- సిలికానాంధ్ర వ్యవస్థాపకులు కూచిభొట్ల ఆనంద్ చొరవతో సాకారం

శాతం రాయితీ అందిస్తూ ఆధునిక యంత్ర పరికరాల సహాయంతో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ వైద్యసేవలు కొనసాగిస్తున్నారు. ఈ కార్పొరేట్ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లోని సుమారు 70 గ్రామాలకు వైద్యసేవలను అందిస్తోంది. బీజేపీ అధికార ప్రతినిధి సాధినేని యామినీ శర్మ ఇటీవల తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేయటంతో 'సంజీవని' ఆసుపత్రి వైరల్ అయ్యింది.

'సంజీవని'లో అందిస్తున్న సేవలు

జనరల్ విభాగంతోపాటు ఎముకలు, గైనిక్, పీడియాట్రిక్, కార్డియాక్, ఈఎన్‌టి, డెర్మటాలజీ, పల్మనాలజీ, న్యూరాలజీ, యురాలజీ, రేడియాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు వైద్యులు నిత్యం సేవలందిస్తుండగా, మిగిలిన వైద్యులు వారినికొకసారి, రెండు వారాలకొకసారి వచ్చి ప్రత్యేక శిబిరాల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇక్కడ ఆరోగ్యశ్రీ సేవలు సైతం అందుబాటులో ఉన్నాయి. ప్రతీరోజు మొవ్వ, ఘంటసాల, పమిడిముక్కల మండలాలకు చెందిన 100 నుంచి 130 మంది వరకు రోగులు ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు.

గర్భిణులకు పూర్తిగా ఉచితం

గర్భిణులు ఈ ఆసుపత్రికి వచ్చిన నాటి నుంచి కాన్పు అయి ఇంటికి వెళ్లే వరకు ఎలాంటి ఫీజులు వసూలు చేయకపోవటం విశేషం. ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించి అంబులెన్స్‌లో వారిని సురక్షితంగా ఇంటికి చేరుస్తూ ఆదర్శ ప్రాయంగా నిలుస్తోంది 'సంజీవని'. 'ఆరోగ్యశ్రీ' కార్డు లేకున్నా డయాలసిస్ రోగులకు ఇక్కడ ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు.

రోగి జబ్బు చూస్తున్నాం.. డబ్బు చూడం



\- సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూచిభొట్ల ఆనంద్

మా వైద్యశాలకు వచ్చిన రోగి జబ్బు చూస్తాం.. కానీ అతని వద్ద డబ్బు ఉన్నదా? లేదా? అని చూడం. గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ తరహా సేవలు అందించాలన్న సంకల్పంతో 2018లో దాతలు, కూచిపూడి పరిసర గ్రామాల ప్రజల సహకారంతో ఆసుపత్రి నిర్మించాం. ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోట్లు ఎదుర్కొంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం.

డయాలసిస్ రోగులకు ఆరోగ్యశ్రీ వర్తింపచేయాలి

\- జొన్నలగడ్డ హనుమకుమార్, ఏవో

డయాలసిస్ రోగులకు ఉచిత వైద్యం అందిస్తున్నాం. వారికి 'ఆరోగ్య శ్రీ' వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం రెండు ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. మరో రెండు థియేటర్లు అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నాం. రోజుకు 100 నుంచి 150 మంది వరకు వైద్యసేవలు పొందుతున్నారు. అంబులెన్స్ సౌకర్యం ఉంది.





భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లను సీపీ రాజశేఖర్ బాబు, దుర్గగుడి అధికారులతో కలిసి పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత

భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లు భేష్

- అధికారులతో కలిసి పరిశీలించిన హోంమంత్రి అనిత


ఇంద్రకీలాద్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి నిర్వహించనున్న భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లను హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఇన్‌చార్జ్ కలెక్టర్ ఇలక్కియా, డీసీపీలు షరీనా బేగం, కృష్ణకాంత్ పటేల్, దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత సంబంధిత అధికారులతో ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె అధికారులతో కలిసి పలు సూచనలు చేశారు. భవానీ భక్తుల ఏర్పాట్లపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భవానీ దీక్షల ప్రత్యేక అధికారి, రాజమండ్రి ఆర్జేసీ వెండ్ర త్రినాధరావు, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, ఏసీపీలు, సీఐలు ఉన్నారు. తొలుత హోంమంత్రి దుర్గమ్మను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందచేశారు. అధికారులు ఆమెకు లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. కాగా, పోలీస్ కమిషనర్ ఆలయ అధికారులతో కలిసి విరమణల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ చైర్మన్ విజయకుమార్ అన్నారు. మంగళవారం జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.శంకర్‌నాయక్ అధ్వర్యంలో ఐదురోజుల శిక్షణ కార్యక్రమం నగరంలోని ఏపీఏవో కార్యాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వ అధ్వర్యంలో జరిగిన రైతన్న మీకోసం' కార్యక్రమంలో రైతులు ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ సలహాదారు రాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌లు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, రైతులందరికి ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగేలా సిబ్బంది వద్ద అన్ని రకాల పంటలు, సాగుచేస్తున్న ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్స్ వుండాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి మాట్లాడుతూ, అందరూ రసాయన రైతులు కొండ ప్రకృతి వ్యవసాయంలోకి రావాలన్నారు. జిల్లాహార్టికల్చర్ ఆఫీసర్ బాలాజీకుమార్, వేణుమాధవ్, ఆర్పీసీఅరుణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి ఎగుమతులు ప్రారంభం

విస్సన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విస్సన్నపేట నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు తోతాపురి మామిడి ఎగుమతులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. కిట్టు మ్యాంగోస్ గ్రోయర్స్ నుంచి ముంబాయికి ఎగుమతి చేశారు. మొదటిరోజు మార్కెట్ ధర రూ.80 వేల నుంచి లక్ష పలికింది. తొలి రోజు 20 టన్నులు ఎగుమతి చేసినట్టు నిర్వాహకుడు రాయల కృష్ణయ్య(కిట్టు)తెలిపారు.



14న రెవెన్యూ సర్వీసెస్ సంఘం ఎన్నికలు

గాంధీనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా బ్రాంచ్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఈనెల 14న జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల అధికారి బి.పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతనెల 29న ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం.. రెవెన్యూ భవన్‌లో ఎన్నికలు జరుగుతాయన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు సహా 16 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య నామినేషన్ల పత్రాల జారీ, 11 నుంచి నామినేషన్ల స్వీకరణ, 1 నుంచి 1.30 పరిశీలన, 2 గంటలకు ప్రచురణ, 2 నుంచి 3 వరకు ఉపసంహరణ, సాయంత్రం 4నుంచి 6 మధ్య ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాల ప్రకటన, ప్రమాణస్వీకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆర్.దుర్గాప్రసాద్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు.

అరకొరే..

(5వ పేజీ తరువాయి)

కాలంగా రూట్లను తగ్గిస్తూ వస్తున్నారు. మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన నేపథ్యంలో సిటీ బస్సులకు విపరీతంగా ఆదరణ పెరుగుతోంది. సిటీ సబర్బన్ పరిధిలో మూడొంతులకుపైగా మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. గతంలో 50-60 మంది ప్రయాణాలు చేసే చోట పీక్ సమయాల్లో 100 మంది వరకు కూడా ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రస్తుతమున్న డొక్కుబస్సులపై ఓవర్ లోడ్ పడుతోంది. ఈ ఓవర్ లోడ్ కారణంగా బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. రేడియేటర్లు హీటెక్కి నీరు ఆవిరై.. ఆగిపోతున్నాయి. రేడియటర్లను చల్లార్చటానికి ఆర్టీసీ సిబ్బంది ఆగిపోయిన బస్సుల దగ్గరకు నీళ్ల క్యాన్లను పంపించాల్సి వస్తోంది. ఇవన్నీ కూడా రానున్న రోజుల్లో తలెత్తే పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. సిటీ బస్సుల ఫ్లీట్‌లోకి కొత్త బస్సులను కొంత వరకైనా తీసుకురాకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందికర పరిస్థితులు తప్పవు.

సబర్బన్ పరిధి విస్తృతం

విజయవాడ సిటీ బస్సుల ఆపరేషన్ అంటే.. కేవలం నగరంలోని 59 డివిజన్లకే పరిమితం కాదు. ప్రస్తుత ప్రతిపాదిత 75 గ్రామాల గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత ప్రాంతాన్ని దాటి ఉంటుంది. విజయవాడ సబర్బన్ లిమిట్ దక్షిణాన గ్రేటర్‌లో ఉన్న గన్నవరం దాటి హనుమాన్ జంక్షన్ వరకు ఉంది. రూట్ నెంబర్ 252 బస్సులు హనుమాన్‌జంక్షన్ వరకు నడుస్తాయి. విజయవాడ నుంచి కంకిపాడు దిగువ వరకే గ్రేటర్ ప్రతిపాదన ఉంటే ఆర్టీసీ సిటీ సబర్బన్ ప్రాంత మాత్రం ఉయ్యూరు దాటి పామర్రు వరకు ఉంటుంది. ఇబ్రహీంపట్నం, కొండపల్లి వరకు విజయవాడ గ్రేటర్ పరిధి ఉంటే .. మైలవరం వరకు ఆర్టీసీ సబర్బన్ పరిధి ఉంది. నున్న వరకు గ్రేటర్ పరిధి ఉంటే.. ఆగిరిపల్లి వరకు సిటీ బస్సుల ఆపరేషన్ సాగుతోంది.

సూపర్ లగ్జరీలను సిటీ బస్సులు మార్చి ప్రయోగం

విజయవాడ సిటీ సబర్బన్ పరిధిలో ఏడాది కిందట వరకు 500 సిటీ బస్సులు ఉండేవి. కాలం తీరిపోయినా కూడా పదేపదే తిప్పి తుక్కు అయిన తర్వాత స్క్రాప్‌కు పోగా, ప్రస్తుతం 374 సిటీ బస్సులు మాత్రమే మిగిలాయి. అంటే 126 సిటీ బస్సులు తగ్గిపోయాయి. ఇంత భారీ సంఖ్యలో బస్సులు తగ్గిపోవటం వల్ల సబర్బన్ సిటీ బస్సుల కొరతను ఎదుర్కొంటోంది. ఈ కొరతను అధిగమించటానికి ఆర్టీసీ అధికారులు నిర్ణీత కాలం ఉపయోగించి వదిలేసిన సూపర్ లగ్జరీ బస్సులను సిటీ బస్సులుగా కన్వర్షన్ చేశారు. ఇలా మొత్తం మీద ఓ 100 లోపు సిటీ బస్సులను సమకూర్చుకున్నారు. దాదాపుగా షార్టేజీ ఉన్న బస్సులను ఈ రూపంలో బ్యాలెన్స్ చేసుకున్నా .. ఇవన్నీ కూడా కాలం తీరిపోవటం వల్ల సరికొత్త సమస్యలు సృష్టిస్తున్నాయి.

ఉచిత ప్రయాణాలతో ఓవర్ లోడ్

ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. దీంతో అధిక సంఖ్యలో సిటీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. విజయవాడ సబర్బన్ పరిధిలో రూరల్ ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ప్రాంతాల ప్రజలంత పెద్ద సంఖ్యలో విజయవాడలో ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. కాలేజీలు, స్కూల్స్‌కు వచ్చే విద్యార్థినీ, విద్యార్థులు కూడా ఎక్కువ సంఖ్యలో ఉంటారు. ఇవన్నీ సబర్బన్ సిటీ బస్సులపై ఓవర్‌లోడ్‌కు దారి తీస్తున్నాయి. డొక్కు బస్సులపై ఓవర్‌లోడ్ పడటంతో ఇటీవల కాలంలో తరచూ ఆగిపోతున్నాయి. అనేక సాంకేతిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి.

విస్తరిస్తున్న ప్రాంతాలకు కనెక్టివిటీ నిల్

ఆర్టీసీ సిటీ సబర్బన్ లిమిట్ చాలా పెద్దదైనా.. కొన్ని పెద్ద రూట్లకే సిటీ బస్సులు పరిమితం అవుతున్నాయి. గ్రేటర్ విలీన ప్రాంతంతో పాటు సబర్బన్ ప్రాంతమంతా పెద్ద పెద్ద కాలనీలతో విస్తరించి ఉంది. హైవే ప్రాంతాలలో తప్పితే గ్రామీణ ప్రాంతాలు, విస్తరించిన కాలనీలకు సిటీ బస్సుల కనెక్టివిటీ దాదాపుగా లేదనే చెప్పాల్సి వస్తోంది. ఈ ప్రాంతాలకు బస్సులను నడపాలంటే ప్రస్తుతం ఉన్న మొత్తం సర్వీసులు ఏమాత్రం సరిపోవు.

ఎలక్ట్రిక్ సర్వీసులు వచ్చినా.. డీజిల్ బస్సులు అవసరమే!

రానున్న రోజుల్లో నగరానికి 100 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయి. సిటీ బస్సుల కొరతను ఇవి తీర్చగలవు. ప్రయాణికులకు కూడా సౌకర్యవంతంగా ఉంటాయి కాబట్టి ఆహ్వానించాల్సిందే. ఇదే సమయంలో ఆ వచ్చే బస్సుల కెపాసిటీ కూడా చూడాల్సిన అవసరం ఉంది. తిరుపతిలో నడుపుతున్న ఎలక్ట్రిక్ బస్సును పరిశీలిస్తే బ్యాటరీ రీ చార్జింగ్ 200 కిలోమీటర్లు మాత్రమే తిరుగుతోంది. అది కూడా సీటింగ్‌కు తగినట్టుగానే ఉండాలి. లోడ్ పెరిగిన కొద్దీ మైలేజీ గణనీయంగా తగ్గిపోతుంది. ప్రస్తుతం స్త్రీ శక్తి పథకం ద్వారా బస్సులపై విపరీతమైన లోడ్ పడుతోంది. ఎలక్ట్రిక్ బస్సుల్లో ఇదే లోడ్ పడితే మాత్రం మైలేజీ దారుణంగా తగ్గిపోతుంది. డీజిల్ బస్సునే కనుక చూస్తే 160 లీటర్ల ట్యాంక్ సదుపాయం ఉంటుంది. ఒకసారి ఫిల్ చేస్తే లీటర్ 4.50 కిలోమీటర్లు వేసుకున్నా హీనపక్షం 500 కిలోమీటర్ల మేర నడుస్తున్నాయి. ఇలాంటపుడు ఎలక్ట్రిక్ బస్సులు 150 - 200 కిలోమీటర్ల మైలేజ్ రేంజ్‌తో ఉంటే.. బస్సుల సంఖ్య కనిపిస్తుంది తప్పితే ఎక్కువ ట్రిప్పులు వేయలేదు. తరచూ చార్జింగ్ పెట్టాల్సి వస్తుంది. చార్జింగ్ కోసం సమయం పడుతుంది. అందువల్ల సిటీలో పూర్తి స్థాయిలో సీఎన్‌జీ బస్సులు తిప్పాలంటే 100 బస్సులు సరిపోవు. ఇప్పుడున్న ఫ్లీట్ 340కు రెట్టింపు ఉంటే తప్ప అవసరాలు తీరవు. ఇన్ని సీఎన్‌జీ బస్సులను విజయవాడకు సమకూర్చుకునే పరిస్థితి లేదు కాబట్టి .. డీజిల్ శ్రేణిలో కొత్త బస్సులను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది.

ఇంటి పన్ను పేరు మార్పుపై..

(5వ పేజీ తరువాయి)

తీసుకెళ్లామని, ఆదేశాలు రాగానే అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మ్యూటేషన్ మాయ' కథనంపై కమిషనర్ స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనల విడుదల చేశారు. 2023లో కూడా ఇదే రీతిలో జరిగిన ఇంటి పన్ను పేరు మార్పులపై కూడా విచారణ అధికారి చర్యలు నిమిత్తం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారని తెలిపారు. దీనిపై కూడా త్వరలో చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. ఇంటి పన్ను పేరు మార్పు చట్టబద్ధ ప్రక్రియలోనే జరగాలని, కానీపక్షంలో పన్ను మార్పులను రద్దు చేసి, పేరు మార్పునకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్ను పేరు మార్పునకు సంబంధించి లేదా ఇంటి డోర్ నెంబర్‌లో తప్పులు ఉన్నా, ఇంటి పన్నుకు సంబంధించి పేరులో ఏమైన తప్పు ఉన్న దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత సచివాలయం పరిధిలోనే అవకాశం కల్పించినట్టు తెలిపారు. దరఖాస్తు సమర్పించిన తర్వాత మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ పరిశీలించి మున్సిపల్ కమిషనర్ ఆమోదం పొందిన తర్వాతే మార్పులు, చేర్పులు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. పన్ను మార్పునకు సంబంధించి ఆస్తి విలువలో ఒక శాతం ఫీజు తప్పనిసరిగా కట్టాలని తెలిపారు.

అవినీతిమయం!

(5వ పేజీ తరువాయి)

సదరు సీసీని సంప్రదించాలని, అతని నుంచి అనుమతులు వచ్చాకనే ఫైళ్లపై సంతకాలు చేసేవారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. గుట్టుచప్పుడు కాకుండా తాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ఈ సీసీ ద్వారా తెరవెనుక అన్ని వ్యవహారాలు చక్కదిద్దేవారనే విమర్శలు ఉన్నాయి. తన సీసీని ప్రసన్నం చేసుకోని టీచర్‌లకు సంబంధించిన ఫైళ్లు పెండింగ్‌లో పెట్టారని, ఇది జగమెరిగిన సత్యమని టీచర్‌లు, కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది బాహాటంగా చెప్పుకుంటున్నారు. డీఈవో కార్యాలయంలోని సిటిజన్ చార్టర్‌ను పరిశీలిస్తే ఎన్ని ఫైళ్లు పెండింగ్‌లో పెట్టారో తెలిసిపోతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

పాడికుండలా ఓపెన్ స్కూల్ విభాగం

జిల్లాలో ఓపెన్ స్కూల్స్‌కు సంబంధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించేందుకు డీఈవో కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఉంది. ఈ విభాగాన్ని వాస్తవంగా డీఈవో కార్యాలయంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ హోదాలో ఉన్న అధికారి పర్యవేక్షించాలి. కానీ ఈ అధికారిని పక్కనపెట్టి, మచిలీపట్నం మండలంలో పనిచేసే, తనకు అనుకూలమైన ఒక టీచర్‌కు ఈ విభాగంలో కీలక బాధ్యతలను అప్పగించారు. సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్లకుండా ఓపెన్ స్కూల్ విభాగంలోనే ఉండిపోతున్నాడు. దీనిపై అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో డీఈవో ఈ ఉపాధ్యాయుడిని పాఠశాలకు పంపినా, తెరవెనుక ఓపెన్ స్కూల్స్ నిర్వాహకులతో సంప్రదింపులు జరిపే బాధ్యతలను అప్పగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో జిల్లాలో 2,500 మందికిపైగా ఏటా పరీక్షలు రాస్తారు. పాస్ గ్యారంటీ పేరుతో ఒక్కొక్కరి నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేశారనే ఆరోపణలు మూటగట్టుకున్నారు.

వ్యవసాయరంగంలో కృతిమ మేధస్సుది కీలక పాత్ర

- ఏఐ వినియోగంపై ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్ర మంత్రి రామనాథ్ ఠాకూర్ వివరణ

విజయవాడ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయరంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు, పంట ఉత్పాదకతను పెంచేందుకు, సరఫరా గొలుసు సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు, రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను ప్రభుత్వం విస్తృతంగా ఉపయోగిస్తున్నట్టు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ వెల్లడించారు. లోక్‌సభలో మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యవసాయ సరఫరా గొలుసులో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖను ప్రశ్నించగా, మంత్రి రామనాథ్ ఠాకూర్ లిఖిత పూర్వకంగా తెలియజేశారు. వ్యవసాయ సరఫరా గొలుసులో కృతిమ మేధస్సు టెక్నాలజీల వినియోగం రైతుల నిర్ణయాలపై, వ్యవసాయ పద్ధతులు, రైతుల ఆదాయం పెంపుదలపై సానుకూల ప్రభావం చూపుతోందన్నారు. రైతుల సందేహాలకు వాయిస్ ఆధారిత సమాధానాలు అందించేందుకు అభివృద్ధి చేసిన 'కిసాన్ ఈ-మిత్ర' చాట్‌బాట్ ప్రస్తుతం పీఎం-కిసాన్, పంట బీమా, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాలపై సమాచారం అందిస్తోందని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

వివిధ పాఠశాలల నుంచి వెయ్యిమంది క్రీడాకారులు హాజరు

జగ్గయ్యపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వ ర్యంలో 14వ బాలచైతన్య స్ఫూర్తి ఆటల పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఆటల పోటీ ల్లో పాల్గొనేందుకు వెయ్యి మంది ఆటగాళ్లు హాజరయ్యారు. ప్రత్యేకంగా స్కూల్ బస్సుల్లో ఆయా స్కూళ్ల పీఈటీలు పిల్లలను తీసుకుని హాజరయ్యారు. అండర్- 14, అండర్- 17 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ ,చెస్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తనయుడు కిట్టు, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు తనయుడు సిద్ధూ, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు మనవడు విశ్వస్థితాంక్‌లు హాజరై పోటీలను వీక్షించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వారు కోరారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తో మిక్ కళాశాల ఒప్పందం

కంచికచర్ల: విద్యార్థులు, అధ్యాపకులు ఆధునిక సాంకేతిక శిక్షణల అవకాశాలను పొందేందుకు వీలుగా కంచికచర్ల మిక్ కళాశాల విజయవాడ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టీ.వంశీ కిరణ్ చెప్పారు. ఇరు సంస్థలు కలిసి ఉమ్మడి పరిశోధన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక మార్గదర్శకత్వం, కార్యశాల, అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒప్పందం కుదరిందని తెలిపారు.

విస్సన్నపేట ఎంపీపీ సీటుకు ఆశావహుల పోటీ

తిరువూరు : ఉప ఎన్నికలో విస్సన్నపేట ఎంపీపీ స్థానం దక్కించుకునేందుకు ఆశావహులు పోటీపడుతున్నారు. వెలుగు కార్యాలయంలో, ఈనెల 11న ఎంపీపీ ఉపఎన్నికకు సంబంధించి ఎన్నికల అధికారిణి, ఆర్డీవో కె.మాధురి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల పరిశీలకులుగా జేసీ ఇలక్కియా వ్యవహరించనున్నారు. మండలంలో 17 ఎంపీటీసీ సెగ్మెంట్లకుగాను మొత్తం వైసీపీ గెలుపొందగా సార్వత్రిక ఎన్నికలకు ముందు విస్సన్నపేట-1సెగ్మెంట్ సభ్యురాలు దొంతు విజయలక్ష్మి టీడీపీలో చేరడంతో వైసీపీ 16 స్థానాల్లో ఉంది. ఎంపీపీ రేస్‌లో గద్దల మల్లయ్య, మేడా తిరుపతిరావు, చాట్ల మణి ఉన్నారు. ఎంపీపీ స్థానం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు మద్దతు సమకూర్చుకునే పనిలో ఉండగా, పార్టీకి నష్టం జరగని విధంగా మండల వైసీపీ నాయకులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు

రైల్వేస్టేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు 17243-17244 గుంటూరు-రాయగడ, రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు బోగీలను అనుసంధానం చేస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న గుంటూరులో, 21న రాయగడలో ఈ రైలు బయలుదేరుతుంది. రైలు 3 ఏసీ త్రీటైర్ కోచ్‌లు, 12 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 3 జనరల్ సెకండ్‌క్లాస్ కోచ్, రెండు ఎస్ఎల్ఆర్ కోచ్‌లు, మొత్తం 20 కోచ్‌లతో నడుస్తుంది. వీటి స్థానే శాశ్వత ప్రాతిపదికన ఒక ఏసీ టూటైర్ కోచ్, 3 ఏసీ త్రీ టైర్ కోచ్‌లు, 14 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 4 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు, రెండు ఎల్ఎస్ఆర్ కోచ్‌లు మొత్తం 24 కోచ్‌లు అనుసంధానమై ఉంటాయి. అదనంగా నాలుగు కోచ్‌లను కలుపుతున్నారు.

అవాస్తవాలతో తప్పుదారి పట్టిస్తున్నారు..!

- ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్

విజయవాడ(స్పోర్ట్స్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొడాలి పిచ్చేశ్వరరావు (కేపీ రావు) అనే వ్యక్తి తనపై అవాస్తవాలు ప్రచారం చేసి అందరినీ తప్పుదోవ పట్టించాడని ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ, పిచ్చేశ్వరరావు తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, అతడ్ని ఆల్ ఇండియా కబడ్డీ ఫెడరేషన్ బ్యాన్ చేసిందని, ప్రస్తుతం ఆయన ఏ అసోసియేషన్‌లోనూ సభ్యుడు కాదన్నారు. క్రీడాకారుల వయస్సు తప్పుగా చూపించానని, ఇటీవల నిర్వహించిన సెలక్షన్ ట్రయిల్స్‌లో మ్యాచ్ ఫిక్సింగ్‌లు జరిగాయని తనపై కేసు పెట్టడం జరిగిందన్నారు. దీనిపై పటమట పోలీసులకు వాస్తవ ధృవీకరణ పత్రాలు అందజేసినట్టు తెలిపారు. ఇటువంటి వ్యక్తుల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దన్నారు. ప్రస్తుత వివాదంతో ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఎటువంటి సబంధం లేదని, దీనిలోకి అయన్ను లాగడం దరదృష్టకరమన్నారు. కొండలరావుపై ఫిర్యాదు నిజమని తేలితే టోర్నమెంట్ నుంచి తప్పిస్తామని హమీ ఇచ్చారు. సమావేశంలో ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.అర్జునరావు, ఎమ్.సుబ్బరాజు, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆరోపణను నిరూపిస్తా.. : కేపీ రావు

యలమంచిలి శ్రీకాంత్ చేస్తున్న తప్పుడు ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని కేపీ రావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా క్రీడాకారిణులతో తనపై ఫిర్యాదులు చేయించాడని, అయితే దీనిపై పోలీసులు విచారించి తప్పుడు ఫిర్యాదులని తేల్చడంతో పాటు వారినుంచి క్షమాపణ పత్రాలను తీసుకోవడం జరిగిందని కేపీ రావు అన్నారు. తప్పుడు ధృవీకరణ పత్రాలవిషయంలో నిరూపించడం జరిగిందని, శ్రీకాంత్‌ను అరెస్టు చేశారా లేదా అనేది పోలీసులు నిర్ధారించాల్సి ఉందన్నారు. తనపై ఎటువంటి చట్టపరమైన కేసులు లేవన్నారు. న్యాయస్థానాలకు అతను సమర్పించిన పత్రాలు ఫోర్జరీ అన్న దానిపై ఇప్పటికీ అదే క్లారిటీతో ఉన్నామని, అతడిపై చేసిన ప్రతి ఆరోపణను నిరూపిస్తానని, దీనిపై ఎవరైనా బహిరంగ చర్చకు రావచ్చని సవాల్ చేశారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్ 149, 158, 169
చికెన్ విత్ స్కిన్ 284
చికెన్ స్కిన్‌లెస్ 294
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి

కానూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మున్సిపల్ పరిధిలోని బందరురోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఆక్రమణదారులే స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమి షనర్ షేక్ నజీర్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రోజురోజుకీ పెరుగుతున్న ఆక్రమణల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. దీనికితోడు అత్యవసర సర్వీస్‌లు అయిన అంబులెన్స్, ఫైర్ ఇంజన్‌లు వెళ్లడం కష్టంగా ఉందని తెలిపారు. ఆక్రమణలను తొలగించని పక్షంలో మున్సిపాలిటీ, హైవే, ఆర్ అండ్ బీ, పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తొలగిస్తారని, ఈ తొలగింపు సమయంలో ఆస్తులకు ఏమైనా నష్టం ఏర్పడితే మున్సిపాలిటీకి ఎటువంటి బాధ్యత ఉండదని, ఆక్రమణలు తొలగించేందుకు అయిన ఖర్చు కూడా ఆక్రమణదారుల నుంచే వసులు చేస్తామని కమిషనర్ షేక్ నజీర్ పేర్కొన్నారు.

ఇరిగేషన్ పనులు పూర్తిచేయండి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గన్నవరం నియోజకవర్గంలోని ఇరిగేష న్ పెండింగ్ పనులు, కొత్తగా మంజూరయిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో పలు పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువల మరమ్మతులు చేపట్టేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఏలూరు కాలువకు నీళ్ల విడుదల చేసేందుకు కాలువ మరమ్మతు పనులను పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధంగా చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్ ఈ మోహన్‌రావు మాట్లాడుతూ, ఎనికేపాడు వద్ద బుడమేరు అండర్ టన్నెల్ ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం ఉందని, బుడమేరు వరద నివారణకు అదనంగా 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో మరో అండర్ టన్నెల్ నిర్మించనున్నామని వెల్లడించారు. ఈ పనులు జనవరి నుంచి జూన్ వరకు ఏలూరు కాలువకు నీటి విడుదలను నిలపాల్సి ఉంటుందని తెలిపారు. ఆరు నెలలపాటు నీటి ప్రవాహాన్ని నిలిపి వేస్తే నియోజవర్గంతోపాటు ఏలూరు జిల్లాలోని కొన్ని మండలాల ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని యార్లగడ్డ అధికారులకు సూచించారు. గన్నవరంలోని గాంధీ బొమ్మసెంటర్ రోడ్ విస్తరణ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డివిజన్ డీఈ గంగయ్య, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం

గన్నవరం: రైతుల వద్ద ఉన్న ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రైతులకు భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి రైతుసేవా కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను, రైతులకు ధాన్యం చెల్లింపులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని లక్ష్మీ మారుతి రైస్ మిల్లును సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్, తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంపీడీవో టీ స్వర్ణలత, గుమ్మడి వెంకట్రామయ్య, మాదల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల అభివృద్ధికి చర్యలు

దావాజీగూడెంలోని బాలికల వసతి గృహాలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం గ్రామంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను తనిఖీ చేసిన ఆయన బాలికల వసతి గదులను, భోజనశాలను, మెనూ పరిశీలించి ఆహారాన్ని రుచి చూశారు. వసతిగృహంలోని విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అధ్యక్షు లు గూడపాటి తులసి మోహన్, తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంపీడీవో టీ స్వర్ణలత పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

కంకిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీలో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రిక మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీన మండలంలోని వివిధ గ్రామాల్లో 34 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హెచ్‌ఈవో కృష్ణారావు, పీహెచ్‌ఎన్ రాజమణి, హెల్త్ సూపర్ వైజర్‌లు శారమ్మ, సుధాకర్, శ్యామల, హెల్త్ అసిస్టెంట్ రాచ మల్ల శ్యామ్ ప్రసాద్, కెనడీ, గోపాలకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, ఎఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

యోగాలో పీవీపీ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కానూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజ్ యోగాసన మెన్ అండ్ ఉమెన్ చాంపియన్ షిప్ పోటీల్లో కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ఇటీవల ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని బీవీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ యోగాసన పోటీల్లో పీవీపీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు టి. దుర్గాజగదీష్ రెండవ స్థానం, జి. వసుంధర మూడవ స్థానం గెలుపొందారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులు, యోగా గురువు గురుమూర్తిలను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు, పీడీ సాంబశివరావు అభినందించారు.

వనరుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన

కానూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో వాలంటీర్లు మంగళవారం పటమటలంకలోని వల్లూరి సరోజినీదేవి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వనరుల వినియోగంపై అవగాహన కల్పించారు. వనరుల పరిరక్షణ, రీసైక్లింగ్ విధానం, సృజనాత్మకతపై ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ఎల్‌హెచ్‌వో ప్రతినిధి రేఖా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్ర మంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ జె. శివరాంప్రసాద్, ప్రోగ్రాం అధికారి కె. మాధవి తదితరులు పాల్గొన్నారు.

బొమ్ములూరులో గిడ్డంగి నిర్మాణం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో బొమ్ములూరులో ఎరువుల గిడ్డంగి నిర్మాణం చేపడుతున్నట్లు ఆ సంఘం ఛైర్ పర్సన్ వడ్డి శివ నాగేశ్వరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంఘం నిధులు రూ.16.65 లక్షలతో గిడ్డంగిని నిర్మించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు.

మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదిత్య బధిర విద్యాలయానికి మానవత సభ్యులు విశ్రాంతి సర్వేయర్ జీవీకే నారాయణరావు మంగళవారం రూ.5వేలు విరాళం అందించారు. ఆయన భార్య వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థుల అవసరార్థం విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, ఆ సంస్థ జంక్షన్ శాఖ అధ్యక్షుడు బాణాల నరసింహారావు సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు శివాల యం ప్రాంగణంలో నిర్మాణం జరుపుకుంటున్న అయ్యప్ప స్వామి దేవాలయానికి మంగళవారం రూ.50,116లు విరాళం అందజేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఎంఎన్నార్ కాంప్లెక్సు యజమాని మద్దుల నాగరాజు, లక్ష్మీ దంపతులు ఈ మొత్తాన్ని అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గూడపాటి రత్నశేఖర్, కమిటీ సభ్యులు తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, తుమ్మల నారాయణరావు, కాకుల శ్రీనివాసరావు, కొలకలేటి భోగేశ్వరరావు దాతను అభినందించారు.

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీలు కాకాని వెంకటేశ్వరరావు(బా బు), తవ్వా పూర్ణచంద్రరావు, ఈవో ఎస్.కృష్ణకి షోర్ మంగళవారం సంయుక్తంగా ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని జనవరి 1న ఉత్తర ద్వారదర్శనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

విద్యుత్ ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ఉయ్యూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు శివాలయం రోడ్డులో ఇటీవల విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడి మృతి చెందిన యువకుడితో పాటు ప్రమాదంలో వైద్యశాల్లో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు యువకుల కుటుంబాలకు అఖిల భారత యాదవ మహాసంఘం నాయకులు ఒక్కొక్కరికి రూ. 1,05,000 చొప్పున యాదవ మహాసభ రాష్ట్ర నాయకుడు బొడ్డు రమేశ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల శివాలయం రోడ్డులో ఓ భవనం వద్ద కట్టిన ఫ్లెక్సీ దించుతూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై నలుగురు యువకులు తీవ్రంగా గాయపడి వైద్యశాలల్లో చికిత్స పొందుతూ వారిలో ఒకరైన జొన్నలగడ్డ పృథ్వీనాథ్ చికిత్స పొందుతూ కొద్దిరోజుల క్రితం మృతి చెందాడు. బాధితుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలన్న ఉద్దేశంతో సంఘం నాయకులు, సభ్యుల సహకారంతో నలుగురికి రూ. 4,20,000 అందజేసామని యాదవ మహాస భ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వీర్ల నాని, రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ గొరిపర్తి శ్రీనివాసరావు, నున్న మాజీ సర్పంచ్, విజయవాడ రూరల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు జీతం శ్రీనివాసరావు పాల్గొని సహాయం అందజేశారు.


విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న వర్ల కుమార్‌రాజా

లక్ష్యసాధనకు కష్టపడాలి : ఎమ్మెల్యే వర్ల

ఉయ్యూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సముచిత ప్రాధాన్యతనిచ్చి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి ప్రయోజకులు కావాలని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల గోల్డెన్ జూబిలీ వేడుకల్లో భాగంగా జిల్లాలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఆటలు, సాంస్కృతిక పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. డీఈఓ డి.రామారావు మాట్లాడుతూ, 2025-2026 డీఎస్సీలో ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల పూర్వ విద్యార్థులు క్రీడల కోటాలో ఉద్యోగాలు సాధించటం గొప్ప విషయమన్నారు. 1975లో స్థాపించిన ఈ కళాశాల ఎంతో మంది సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరేందుకు బాటలు వేసిందని సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు మలినేని రాజయ్య కొనియాడారు. సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, 2001 నుంచి ఈ కళాశాలను అకాడమి తీసుకుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఈ కళాశాలను ప్రతి ఒక్కరు వినియోగించుకుని ఉనత్న స్థానాలకు చేరుకోవాలని కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహ రిరావు అన్నారు. ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనా రాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, డెరెక్టర్ వినయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు.

కాటూరు స్కూల్‌లో మధ్యాహ్నభోజనం పరిశీలన

ఉయ్యూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పరిశుభ్రమైన వాతావరణంలో రుచి, సుచి కరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి సూచించారు. కాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాల, పాత్రలు పరిశీలించి ఆహారం రుచి చూశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి పలు పథకాలతో పాటు మధ్యాహ్న భోజనం అమలు చేస్తుందన్నారు. జాగ్రత్తలు తీసు కోవడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, సుస్థిర విద్యావాతావరణానికి, విద్యాసంస్థల్లో మరింత ఆరోగ్యకరమైన భవితవ్యానికి దారి తీస్తుదన్నారు.

ఆకట్టుకున్న హనుమాన్‌చాలీసా పారాయణం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అభయాంజనే యస్వామి దేవస్థానం వద్ద రేమల్లె గ్రామానికి చెందిన లక్ష్మీగణపతి భజన సమాజం నిర్వాహకురాలు యనమదల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం ఆకట్టుకుంది. అభయాంజనేయస్వామికి ప్రీతికరమైన రోజు కావ డంతో దేవస్థానం వెనుక వేదికపై ఆ భజన సమాజం సభ్యులు ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి పారాయణం జరిపారు.

విభేదాలు వద్దు.. కలసి నడుద్దాం

టీడీపీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు: దయాల

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కష్టించి పనిచేస్తున్న కార్యకర్తల మనోభావాలకు వక్రభాష్యం చెపుతూ విభేదాలు సృష్టించాలని చూస్తే సహించేది లేదని పార్టీ మండల అధ్యక్షుడు దయాల రాజే శ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ రేమల్లె అధ్యక్షుడు కొల్లూరి చంద్రకాంత్ ఇంటి వద్ద మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ బాణావతుల ఆదియ్య, కలపాల రాధాకృష్ణమూర్తి, ఈడే అక్కయ్య తదితర పెద్దలతో కలిసి పాల్గొన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కంచుకోటగా ఉన్న రేమల్లెలో కొందరు వ్యక్తులు కావాలని వివాదాలు సృష్టిస్తూ దానికి కులం రంగు పులుముతున్నారని దయాల ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లూరి చంద్రకాంత్ తనకు జరిగిన అకారణ బదిలీ గురించి సోషల్ మీడియాలో మాట్లాడితే దాన్ని వక్రీకరించి విభేదాలు సృష్టించే విధంగా కులాలకు అంటగట్టడం భావ్యం కాదని అందరం కలసికట్టుగా నడుద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యదర్శి ఈడే నారాయణ, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి కొనకాల దుర్గారావు, క్లస్టర్ ఇంచార్జి కలపాల కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ తిరువీదుల మరియదాసు, యూనిట్ ఇంచార్జి గుడివాడ విజయానంద్, చేబత్తిన సౌరి, లోకేష్, బెజవాడ శివయ్య తదితరులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణదేవాలయ వార్షికోత్సవ పూజలో పాల్గొన్న ఎన్నారై రాంబాబు, ఆళ్ల

రంగన్నగూడెం అభివృద్ధికి సహకరిస్తా

● శ్రీకృష్ణ దేవాలయ వార్షికోత్సవంలో ఎన్నారై రాంబాబు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రంగన్నగూడెం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎన్నారై తుమ్మల రాంబాబు అన్నారు. రంగన్నగూడెంలోని శ్రీకృష్ణ దేవాలయ వార్షిక మహోత్సవ ప్రత్యేక పూజల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, అర్జునరావు దంపతులు కల్యాణం నిర్వహించారు. తదనంతరం ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ, ఆర్‌ఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో తుమ్మల రాంబాబు సహకారంతోనే ప్రజలకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరందిస్తున్నామన్నారు. విద్య, వైద్యంతో పాటు గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తున్న ఎన్నారై రాంబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొలుసు బలరాం, కాట్రు పాపారావు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై దర్యాప్తు వేగవంతంచేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో పోస్టాఫీసు వద్ద బాధితుల ధర్నా

ఉంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు సబ్‌పోస్టాఫీసులో జరిగిన అవినీతిలో బాధ్యులను వెంటనే అరెస్ట్‌చేసి వారు దోచుకున్న లక్షలాది రూపాయల సొమ్మును రికవరీ చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు మంగళవారం స్థానిక పోస్టాఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ శివప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ, పోస్టాఫీసులో నిధుల స్వాహా వ్యవహారం బయటపడి సుమారు 20రోజులు కావస్తున్నా ఎలాంటి పురోగతి కనిపించడంలేదన్నారు. పోస్టల్ విజిలెన్స్ అధికారులు ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.34లక్షల మేర అవినీతి జరిగిందని తేలిందన్నారు. పరారీలో వున్న పోస్ట్‌మేన్ శేఖర్‌ను అరెస్ట్ చేసి అతని దగ్గర వున్న సుమారు 300 పాస్‌పుస్తకాలు స్వాధీనం చేసుకుంటే ఎంతమేర సొమ్ము స్వాహా జరిగిందనేది స్పష్టమవుతుందన్నారు. నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో సూత్రధారిగా వున్న పోస్ట్‌మాస్టర్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు, పవన్, బాధితులు లక్ష్మీ, భవాని, చందమ్మ, కళ్యాణి, పనసా గంగమ్మ, మర్లపు రంగారావు, లక్ష్మి పాల్గొన్నారు.

కళ్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఉంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కళ్ల ఆరోగ్యపరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చెక్ చేయించుకుంటూ కంటిచూపును కాపాడుకోవాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు అన్నారు. మండలంలోని నారయ్య అప్పారావుపేటలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండో రోజైన మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ శంకర నేత్రాలయ వారి సహకారంతో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 134 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఇళ్ల పట్టాలు పంపిణీ

పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలోని కానూరులో ప్రధాన డ్రెయిన్ అంచున ఇళ్లు కోల్పోయిన కుటుంబాల వారికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మంగళవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో షుమారు 22మంది నిర్వాసితులకు తాడిగడప నుంచి పెనమలూరు వెళ్లే డొంక రోడ్డులో ఇళ్లస్థలాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, పార్టీ పెనమలూరు మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, టీడీపీ నాయకులు అంగిరేకుల మురళి, సంగెపు రంగారావు, బొంగరాల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై - 2 తాతాచార్యులు

హెల్మెట్ వినియోగంపై అవగాహన

కంకిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిన్న ప్రమాదం కుటుంబాలను చిన్నాభిన్నం చేసేస్తుందని కంకిపాడు ఎస్సై - 2 తాతాచార్యులు అన్నారు. దావులూరు టోల్‌గేట్ వద్ద హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో మంగళవారం ఆయన అగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై 2 తాతాచార్యులు మాట్లాడుతూ, హెల్మెట్ ధరించటం వల్ల ప్రమాదం జరిగినా ప్రాణాలాకు నష్టం తక్కువగా ఉంటుందన్నారు. ఎక్కువశాతం మంది యువత హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్నారని, చిన్న ప్రమాదం జరిగినా కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అయిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అశోక్, కుమార్, పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.30 వేలు చేయాలి

● మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఏపీఎంసీఏ సభ్యులు

విజయవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రాష్ట్ర మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) సభ్యులు బుధవారం నగరంలోని ఫ్యామిలీ వెల్ఫేర్ భవనంలో కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. సమ్మె సమయంలో చెప్పిన రూ.30వేల బేసిక్ శాలరీగా రూ.10వేలు ప్రోత్సాహకాలుగా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రాత్రి 8 గంటల ఎఫ్ఆర్ఎస్ తీసేసి, సమ్మెకాలపు జీతాన్నివ్వాలని కోరారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం పెండింగ్ ఇన్సెంటివ్స్ ఇచ్చి బదిలీలు చేయడానికి అంగీకరించినందుకు వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి స్పందిస్తూ రూ.30వేల బేసిక్ శాలరీతో పాటు రూ.10 వేలు ప్రోత్సాహకాలుగా ఇస్తూ త్వరలో స్ట్రక్చర్ ఫైల్ పెడతామని, రాత్రి 8గంటల ఎఫ్ఆర్ఎస్ వేయడాన్ని కూడా తొలగిస్తామన్నారు. త్వరలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌తో మీటింగ్ ఏర్పాటుచేసి సమస్యలపై మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీఎంసీఏ రాష్ట్ర సెక్రటరీ సందీప్‌కుమార్, గుంటూరు సెక్రటరీ లింగరాజు, కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ యామిని పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయవాడ లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలికపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడిపై నేరం రుజువుకావడంతో 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. మాచవరం పోలీసు స్టేషన్ పరిధిలోని విజయనగర్ కాలనీ ఏరియాలో బాధితురాలు (16) తల్లి, ఇద్దరు తమ్ముళ్లతో నివసిస్తోంది. కొంతకాలం హాస్టల్‌లో చదువుకొని కరోనా వచ్చినప్పటి నుంచి ఇంటిదగ్గరే ఉంటోంది. ఈ క్రమంలో మారుతీనగర్ ప్రాంతంలో నివసించే సాయి అనే వ్యక్తి పరిచయమవగా అప్పుడప్పుడు ఫోన్లో మాట్లాడుకొనేవారు. ఈ క్రమంలో 2021 జూలై 23న ఇంటిలో ఎవరూ లేని సమయంలో సాయికుమార్ వచ్చి గుణదల సమీపంలో హోటల్‌లో రూమ్‌లోకి తీసుకొని వెళ్లి నిన్ను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకొంటానని బలవంతం చేసినట్టు బాధితురాలు ఇంటికి వచ్చి తల్లికి చెప్పింది. ఇద్దరూ కలిపి మహిళా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడు సాయికుమార్‌పై పోక్సో కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పీపీ గడ్డం రాజేశ్వరరావు 15 మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.



ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ద్వితీయ రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

ఎన్ఎంయూ ద్వితీయ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

బస్‌స్టేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ద్వితీయ రాష్ట్ర మహాసభను ఈనెల 12న విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న నేపథ్యంలో వాల్ పోస్టర్‌ను మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారధి, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, విష్ణుకుమార్ రాజు, గద్దె రామ్మోహన్ రావు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, ఏపీ జేఏసీ చైర్మన్ ఏ విద్యాసాగర్, ఏపీ జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డీవీ రమణ, విశిష్ట అతిథులుగా, గౌరవ అతిధులుగా పాల్గొంటారని అసోసియేషన్ నేతలు తెలిపారు. అలాగే ఉన్నతాధికారులు, ఈడీలు, సలహాదారులు, ఉద్యోగులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది అసోసియేషన్‌లోని అన్ని స్థాయి కమిటీల నేతలు, కమిటీల గౌరవాధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు హాజరుకానున్నట్టు చెప్పారు.



సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు వెనిగండ్ల, వర్ల, ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ జవహర్, రావి తదితరులు

కుటుంబవ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాలి

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి జవహర్

గుడివాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సోదరులంతా కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ తెలిపారు. మంగళవారం స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద మాదిగ ఉద్యోగులు, బంధువులు ఉపకులాల ఆధ్వర్యంలో 16వ ఐక్య క్రిస్మస్ ఉత్సవ్ మిలాప్-2025ను ఘనంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి జవహర్ క్యాండిల్ సర్వీస్ చేసి సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువుపై దృష్టిపెట్టి, వారి బంగారుభవితకు బాటలు వేయాలన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడలో ఎప్పుడు చూడని అభివృద్ధి చూస్తున్నామంటే అది దేవదేవుడి దీవెనల ఫలితమేనన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ ప్రేమను పంచుతూ మనకున్నదాంట్లో పొరుగువారికి సహాయం చేయడమే క్రిస్మస్ నిర్వచనమన్నారు. అనంతరం పేదలకు నూతన వస్త్రాలు అందజేశారు. సీటీసీఎస్‌సీ రాష్ట్ర కన్వీనర్ ఉప్పలపాటి ఆశీర్వాదం, ఉత్సవ్‌మిలాప్ పెద్దలు కంచర్ల సుధాకర్, కొదమల గంగాధర్, కేజే విక్టర్‌పాల్, ఉప్పల మాణిక్యాలరావు, కొడాలిబాబు, అద్దంకి మాణిక్యాలరావు, ఇంటూరి గజేంద్ర, పసలాది శేఖర్, కలపాల కార్తీక్, పమిడిముక్కల వంశీ, కంచర్ల సునీల్, కలపాల బాబురావు పాల్గొన్నారు.

ఐలా ఎన్నికలకు సమాయత్తం

ఆటోనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గేడ్-1గా ఉన్న జవహర్ ఆటోనగర్ ఐలా సర్వీస్ సొసైటీ పాలకవర్గం ఎన్నికలకు కార్మికవాడలోని కార్మిక సంఘాలు సమాయత్తమవుతున్నాయి. తమ ప్యానళ్లకు అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తున్నారు. మూడేళ్ల తరువాత ఎన్నికలు జరుగుతుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. 1,775 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఈనెలాఖరులోగానీ లేదా వచ్చేనెల మొదటి వారంలో గానీ ఎన్నికలు జరపాలని అధికారులు భావిస్తున్నారు. ఆస్తిపన్ను 60శాతం పైగా లబ్ధిదారుల నుంచి వసూలవడంతో ఎన్నికలకు క్లియరెన్స్ లభించింది. ఐలా కమిషనర్ కే బాజ్జీ ఏపీఐఐసీ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. నేడో లేదా రేపో ఎన్నికల అధికారిని నియమించాలని నివేదిక పంపనున్నట్టు తెలిసింది. ఎన్నికల అధికారిని నియమిస్తే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయినట్టే. మరోవైపు ఎన్నికలు త్వరగా నిర్వహించాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఐలా కమిషనర్‌కు సూచించినట్టు తెలిసింది. విదేశ పర్యటనలో ఉన్న ఏపీఐఐసీ ఎండీ వచ్చాక ఎన్నికల అధికారి నియమితులయ్యే అవకాశం ఉంది.





చీకట్లో రద్దీగా ఉన్న రోడ్డు



దీపాలు లేక చీకటిమయం

చిమ్మచీకట్లో భయానక ప్రయాణం

ముస్తాబాద రోడ్‌లో అంధకారం రాజ్యమేలుతోంది. నెలల తరబడి వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రజా సంక్షేమంపై అధికారులు వహిస్తున్న నిర్లక్ష్యానికి చీకట్లు అలుముకున్న ఈ రోడ్లే నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఆదాయ వనరులు మెండుగానే ఉన్నప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం పరిధిలో విజయవాడ నగరానికి ఆనకుని ఉండే ముస్తాబాద పరిధిలోని గ్రామాలు రోజురోజుకీ అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లు, పలు కంపెనీల స్థాపనతో ఆదాయం బాగానే ఉంటుంది. అయితే అధికారుల నిర్లక్ష్య వైఖరి ప్రజల పట్ల శాపంగా మారింది.

\- ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ

అంధకారంలో ముస్తాబాద రోడ్ ● భారీ గోతుల్లో విన్యాసాలు ● పట్టించుకోని అధికారులు

ముస్తాబాద వీధి లైట్లు 6 నెలలుగా వెలగడం లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. రోడ్లపై భారీగా గోతులు పడినా ఇంతవరకు పట్టించుకోలేదు. అంతేకాక రోడ్ల వెంబడి లైట్లు వెలగకపోవడం పలు ప్రమాదాలకు కారణమవుతోంది. ప్రధానంగా రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు అత్యధికంగా విజయవాడకు రాకపోకలు సాగిస్తుంటారు. విజయవాడలోని ఆటోనగర్‌తో పాటు పలు కంపెనీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లో పని చేసేందుకు గ్రామస్థులు అత్యధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేపుడు కార్మికులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి వెదురుపావులూరు మీదుగా ముస్తాబాద గ్రామానికి చేరుకునే రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. రింగ్‌రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రారంభంలో రోడ్డు పక్కన మీడియం డ్రెయినేజీ ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డు కోతకు గురైంది. డ్రెయినేజీ వైపునకు రోడ్డు ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గ్రామ పంచాయతీ పరిసరాల్లోని కంపెనీలకు భారీ వాహనాల రాకపోకలు ఇదే రోడ్డు మార్గం ద్వారా సాగుతుంటాయి. గుంతలతో ఉన్న రోడ్లపై పగటి సమయంలోనే వాహనాలు సర్కస్ ఫీట్లు చేస్తూ ముందుకు సాగుతుంటాయి. ఇక చీకటి పడితే ప్రమాద తీవ్రత స్థాయి రెట్టింపు అవుతుంది. చిమ్మచీకట్లు అలుముకున్న రోడ్లపై ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో వాహనాలకు విస్తృతంగా వినియోగిస్తున్న ఎల్‌ఈడీ లైట్ల కారణంగా ఎదురుగా రోడ్డు కనిపించని పరిస్థితి. ఎల్‌ఈడీ లైట్లతో కళ్లు మూసుకుపోయే పరిస్థితుల్లో కనీసం వీధి లైట్లు అయినా ఉంటే కొద్దిసేపటికైనా రోడ్డు కనిపించే ఆస్కారం ఉంటుంది. 6 నెలలుగా లైట్లు వెలగకపోవడంతో ప్రమాదపు అంచున ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కనీసం ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి వీధి లైట్లను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



అంధకారంగా మారి ముస్తాబాద రోడ్

ఇటీవల గుడివాడ ఆసుపత్రి పక్కన ఏఆర్‌టీ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆ సెంటర్ తొలగించకపోతే విధులకు హాజరవ్వనని సర్జన్‌గా విధులు నిర్వహించే డాక్టర్ నాలుగు రోజుల పాటు మొండికేశాడు. చివరికి జిల్లా వైద్యాధికారి రంగంలోకి దిగడంతో మంకుపట్టు వదిలారు. చివరకు సెంటర్‌ను ఆసుపత్రిలోని మరోచోటకు మార్చారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని ఓ యూపీహెచ్‌సీలో హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు చేయాలని వెళ్లిన వారిని పాతాసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌కు వెళ్లాలని సూచిస్తున్నారు. దీంతో అక్కడే ఏఆర్‌టీ సెంటర్‌లో పరీక్షలు జరుగుతున్నాయి.

హడలెత్తిస్తున్న హెచ్‌ఐవీ

● వియవాడ సెంట్రల్ నియోజకవర్గంలోనే అధిక కేసులు
● ఉయ్యూరు, అవనిగడ్డ, గుడివాడ కేంద్రాల్లో కేసుల ప్రభావం ● ప్రత్యేక కార్యాచరణతోనే కట్టడి
● నిర్ధారణ పరీక్షలు పెరగాలి ● ఉమ్మడి జిల్లాల్లో 450కి పైగా హెచ్‌ఐవీ మరణాలు

బెంజ్‌సర్కిల్, ఆంధ్రజ్యోతి: హెచ్‌ఐవీ చాపకింద నీరులా అంతకంతకూ పెరుగుతూ హడలెత్తిస్తోందని నిర్ధారణ పరీక్షలు చేసేవారు చెబుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 25,368 మంది హెచ్‌ఐవీ మందులు వినియోగిస్తున్నారు. బహిరంగ పరచని కేసులు మరో 18వేల వరకు ఉండొచ్చని అనధికారికంగా చెబుతున్నారు. అన్నీ తెలిసిన వైద్యులు, పరీక్ష నిర్ధారణ సిబ్బందే పరీక్షలు నిర్వహణకు వెనకడుగు వేస్తుండడం గమనార్హం. ఎన్టీఆర్ జిల్లాలో 2,567 కేసులు కొత్తగా నమోదయ్యాయి. కృష్ణాజిల్లాలో 500కు పైగా నమోదయ్యాయి. అవనిగడ్డ, గుడివాడ, ఉయ్యూరు మండలాల్లో ఇది అధికంగా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో సెంట్రల్ నియోజకవర్గంలో కేసుల ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఎన్‌జీవోలు అవగాహన కల్పిస్తున్నా కేసుల తగ్గడం లేదంటున్నారు. ఉమ్మడి జిల్లాల్లో సుమారు 450 మందికి పైగా మరణించినట్టు గణంకాలు చెబుతున్నాయి. లెక్కలోకి రాని మరణాల సంఖ్య ఇంకా ఎక్కువే. 23 నుంచి 35 ఏళ్లవారిలో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. 2009 నుంచి 2015 వరకు కొత్త కేసుల నమోదు ఎక్కువగా ఉందని గత పదేళ్లలో చూస్తే ప్రస్తుతం తగ్గినట్టు చెబుతున్నారు. ఏడాదికి 50 కంటే తక్కువ కేసులు నమోదైతే పూర్తిగా నియంత్రణలోకి వచ్చినట్టు 2030 వరకు పూర్తిగా తగ్గే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

లెక్కలోకి రాని వారితో మరింత ప్రమాదం

హెచ్‌ఐవీపై అవగాహన రాహిత్యం, భయం, పరువు పోతుందన్న కారణాలతో పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు రావడం లేదని అంచన వేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో సుమారు 20వేల మందికి పైగా హెచ్‌ఐవీ సోకినవారు పరీక్షలు చేయించుకోవడానికి రావడం లేదని చెబుతున్నారు. నిర్ధారణ పరీక్షలు చేస్తే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. వీరివల్ల మరికొంత మందికి వ్యాధి ప్రబలే ప్రమాదం ఉంది.



ఉచిత నిరోధ్‌ల పంపిణీ

హెచ్‌ఐవీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉచితంగా నిరోధులను ఎన్‌జీవోలు పంపిణీ చేస్తున్నాయి. చిరు వ్యాపారాలు సాగించే వారి వద్ద, మండల కేంద్రాల్లోనూ పంపిణీ చేస్తున్నా వినియోగంలో అంత ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఎన్‌జీవోల సాయంతో నెలకొల్పిన నిరోధుల పంపిణీ కేంద్రాలు ప్రభావం చూపడం లేదని చెబుతున్నారు.

ప్రత్యేక కార్యచరణతోనే కంట్రోల్

వయసు, లింగ బేధం లేకుండా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తేనే వ్యాధి ప్రభావం లెక్కలోకి వస్తుంది. దీంతో వ్యాధి బారిన పడినవారు ఎన్నో దశలో ఉన్నారో లెక్కించడం కుదురుతోంది. దీన్నిబట్టి వారికి మందులు సూచిస్తే మరణాలను కట్టడి చేయొచ్చు. అంతేకాకుండా కచ్చితమైన లెక్క బయట పడుతుంది. దీంతోనే హెచ్‌ఐవీని కంట్రోల్ చేసే అవకాశం ఉంది.

చేతివాటం ఎవరిది..?

తొలగించిన ఇళ్లను మళ్లీ గృహాలుగా చూపించే యత్నం ● అప్పుడు అండగా ఉన్న వారెవరు..?
● మొండిగోడలతో భయబ్రాంతులకు గురవుతున్న స్థానికులు ● ప్రహరీ నిర్మించాలని డిమాండ్

రాణిగారితోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లెక్కల ప్రకారం అవి తొలగించిన ఇళ్లు, ఇందులో నివసించే వారికి పునరావాసం కింద ఎప్పుడో ఇళ్లు కేటాయించారు. అయితే స్థానిక వైసీపీ నేతల కనుసన్నల్లో జరిగిన గిమ్మిక్కులో అవి మళ్లీ జనావాసాల కింద చూపించే ప్రక్రియ ప్రత్యక్షంగా చూసిన వారికి దిమ్మతిరుగుతోంది. కృష్ణానది రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భాగంగా కృష్ణలంక, రాణిగారితోటతో పాటు వాల్ పరివాహక ప్రాంతంలో ఇళ్లను తొలగించారు. ఆ ఇళ్లల్లో నివసించే వారికి పునరావాసం కింద ఇళ్లను కేటాయించారు. అనంతరం వాల్ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు రిటైనింగ్ వాల్‌కు మిగిలిన ఇళ్లకు మధ్య ఉన్న ప్రాంతంలో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. అనంతరం ప్రస్తుతం ఉన్న ఇళ్ల నుంచి వాల్ వైపు రాకపోకలు లేకుండా మరో సరిహద్దు గోడను నిర్మించారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. అప్పటి వైసీపీ నేతలు ఈ గోడ నిర్మాణ సమయంలో తమ ఆలోచనలకు పదును పెట్టి కొన్నిచోట్ల తొలగించిన ఇళ్లస్థలాల్లోకి గోడ రాకుండా చేశారు. అధికారులు తీసివేసిన ఇళ్ల వద్ద వేసిన మార్కింగ్ ప్రకారం గోడ నిర్మించాల్సి ఉండగా కొన్నిచోట్ల అదే జరిగినా, మరికొన్ని చోట్ల ఆ స్థలాలు ఆక్రమించే ప్రయత్నంలో భాగంగా గోడను భిన్నంగా నిర్మించేలా పావులు కదిపారు. అదే విధానం రాణిగారితోట 17వ డివిజన్‌లో జరిగింది. తారక రామానగర్‌లో రెడ్డిగారి కొట్టు సమీపంలో వాల్ నిర్మాణంలో భాగంగా రెండు నివాసాల్లో కొంత తొలగించి అందులో నివసిస్తున్న దాదాపు నాలుగు కుటుంబాలకు ఇళ్లు కేటాయించారు. మిగిలిన భాగాన్ని తొలగించలేదు. ఎందుకనేది అప్పుడు ఇళ్లు తొలగించిన అధికారులకు తెలియాలి. ఇక్కడే ఓ వైసిపి నేత తన బుద్ధిని వాడి వాటిని తొలగించకుండా ప్రహరీ నిర్మించేలా చేసి వాటిని తన ఆధీనంలో ఉంచుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. కాలక్రమేణా వాటి గురించి అందరూ మర్చిపోయాక తిరిగి నివాస గృహాలుగా చేసే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సగం కూల్చిన ఈ ఇళ్లల్లో స్థానికంగా కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడంతో పాటు విషసర్పాలకు నిలయంగా మారడంతో కొందరు స్థానికులు ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వెంటనే ఈ వ్యవహరంపై దృష్టి సారించి సగం కూల్చిన ఇళ్లను పూర్తిగా తొలగించి, ఆ స్థలం అన్యాక్రాంతం కాకుండా గోడను నిర్మించాలని, అలాగే ప్రమాదకరంగా ఉన్న గోడలను కూల్చాలని కోరుతున్నారు,



దూరంగా నిర్మించిన ప్రహరీ గోడ





సగం కూల్చగా మిగిలిన రెండు ఇళ్లు, ప్రమాదకరంగా ఉన్న గోడలను చూపిస్తున్న స్థానికుడు

ఎమ్మెల్యే గద్దె దృష్టికి తీసుకువెళతాం!

రాయి రంగమ్మ, టీడీపీ డివిజన్ అధ్యక్షురాలు

ప్రహరీ నిర్మాణంలో జరిగిన అవకతవకలు, ఇళ్లు తీసివేసిన తరువాత ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలాల్లో నిర్మించిన ఇళ్లను ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్న విషయాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళతాం. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం వహించిన, వహిస్తున్న అధికారులపై, వైసీపీ నేతలకు వంతపాడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరతాం.

చిన్నారులను స్వతంత్రంగా ఎదగనీయాలి

● సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

మొగల్రాజపురం/విజయవాడ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను స్వతంత్ర భావాలతో ఎదగనీయాలని అపుడే వారిలో సృజనాత్మకత బయటకు వస్తుందని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో బాలోత్సవం 8వ పిల్లల పండుగ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. మంత్రి కందుల దుర్గేష్‌తోపాటు అమరావతి బాలోత్సవం సభ్యులు జాతీయ పతాకంతో పాటు బాలోత్సవం జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో బాల్యం ఒక మరపురాని జ్ఞాపకమని, ఇలాంటి పండగలను నిర్వహిస్తున్న బాలోత్సవం కమిటీ చేస్తున్న కార్యక్రమంలో మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని ప్రతి జిల్లాలో నిర్వహించేలా చూస్తానని చెప్పారు. చిన్నారులపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను బలవంతంగా రుద్దవద్దని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ పిల్లలు దేవుళ్లతో సమానమని వారిని ప్రపంచం గర్వించదగ్గ విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ అధికారి సూర్యప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు, గురువులే మొదటి మార్గదర్శకులని అన్నారు. అధ్యక్షత వహించిన అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు రాష్ట్ర విభజనానంతరం బాలోత్సవాన్ని ఎలా రూపొందించాం, అందుకు దారి తీసిన అవస్యకతను వివరించారు. సభావేదికకు కోటి మొక్కలు నాటిన వనజీవి పద్మశ్రీ దరిపల్లి రామయ్య పేరుపెట్టడం గురించి మాట్లాడుతూ మొక్కలు నాటాల్సిన అవసరం గురించి విద్యార్థులకు అవగాహన కలుగుతుందని రామయ్య పేరు పెట్టినట్టు చెప్పారు.





సభలో ప్రసంగిస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

5 వేదికలపై నిర్వహించిన పోటీల్లో 200 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీలు, మట్టితో ఆకృతులను తయారు చేయడం, వక్తృత్వం, కథారచన, కార్టూనిస్ట్, అంతర్జాలంలో అన్వేషణ, విచిత్ర వేషధారణ, లఘునాటిక, క్లాసికల్ నృత్యాలు, ఫాన్సీ డ్రెస్ వంటి వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించారు. అమరావతి బాలోత్సవం ప్రతినిధులు ఎస్‌పీ రామరాజు, మురళీకృష్ణ, నాగళ్ల విద్యాఖన్నా, యార్లగడ్డ సుబ్బారావు, కే యతిరాజు నాయుడు (నవ స్కంద డెవలపర్స్, బెంగుళూరు), బండి రాజేష్ (నైరా ఇన్‌ఫ్రా హైట్స్, బెంగుళూరు), క్రెడాయ్ అధ్యక్షుడు జీఎస్ రామ్మోహన్, క్రెడాయ్ కార్యదర్శి కే రఘురాం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

పీబీ సిద్ధార్థ వేదికగా 8వ అమరావతి బాలోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో అలరించారు. విజయవాడ, పరిసరాల్లోని 192 పాఠశాలల నుంచి 5,500 మంది విద్యార్థులు పాల్గొనడంతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ప్రకృతే సర్వం అనే నినాదంతో వేసిన జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. మట్టి బొమ్మల తయారీతో ఆలోచింపజేశారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, కుటుంబ వ్యవస్థను కాపాడాలని, నిజాయితీ, స్వేచ్ఛగా జీవించాలని నాటకాల ద్వారా సందేశమిచ్చారు. 10, 11న సైతం పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు ముందస్తుగా ఇచ్చిన థీమ్ ప్రకారమే చిన్నారులు సన్నద్ధులై పోటీలకు హాజరయ్యారు. తమ సృజనాత్మకతకు పదును పెట్టి ప్రదర్శన ఇచ్చారు. భూమిపై నాగరికత మొదలైనప్పటి నుంచి నేటి వరకు మనిషి ఎదిగిన తీరుకు ప్రకృతి ప్రభావితమవుతున్న ఘటనలను క్రోడీకరించి ఇచ్చిన ప్రదర్శనలు, డిబేట్‌లు, గీసీన చిత్రాలు, రాసిన లేఖలు, చెప్పిన కథలు, చేసిన నృత్యాలు ఆద్యంతం ఆలోచింపజేశాయి.

పెనమలూరు అభివృద్ధికి చర్యలు

● అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సమస్యలను సత్వరమే పరిష్కరించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. మంగళవారం పోరంకిలోని ద్వారకా కన్వెన్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి ఆయన అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాలకు ప్రతిష్ఠాత్మకంగా విజన్ యూనిట్ రూపొందించిందన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో సమీక్ష సమావేశం నిర్వహించి కీలక పనితీరు సూచికలు సాధించడానికి నియోజకవర్గ వారీగా శ్రద్ధ చూపుతున్నామన్నారు. ఏ ఏ అభివృద్ధి పనులు ఏ స్థితిలో ఉన్నాయి, ఏమైనా ఇబ్బందులుంటే ఎలా పరిష్కరించాలి అన్న వాటిపై చర్చించామన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖలతో కలిసి సమీక్ష నిర్వహించామని, దీర్ఘకాలికంగా ఉన్న భూసమస్యలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఉయ్యూరు డివిజన్‌లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి సంబంధించి స్థలం ఇస్తామని దాత సజ్జా వెంకటేశ్వరరావు ముందుకు వచ్చారని, నిధులు ఎలా సమకూర్చుకోవాలో, కార్యాలయాలు ఎలా నిర్మించాలో చర్చించామన్నారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పన, ముస్లిం సోదరులకు ఈద్గా కాంపౌండ్ ఏర్పాటుకు చర్చించామన్నారు. అమృత్ 2.0 కింద కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇంటింటికీ తాగునీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్, డ్వామా పీడీ శివ, డీఆర్డీవో పీడీ హరినాథ్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, ఎస్ఈ సోమశేఖర్, ఆర్ అండ్ బీ లోకేష్, అధికారులు శివరాంప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, జిల్లా ఏవో పద్మావతి, తాడిగడప కమిషనర్ నజీర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

కొండాలమ్మ హుండీ ఆదాయం రూ.16.58లక్షలు

గుడ్లవల్లేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో హుండీలను మంగళవారం లెక్కింపు నిర్వహించారు. 45 రోజులకు భక్తులు అమ్మవారికి ఆలయ హుండీ ద్వారా రూ.16.58 లక్షలు కానుకలుగా సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. బంగారం 920 మిల్లీగ్రాములు, వెండి 125 గ్రాములు సమర్పించారని ఈవో తెలిపారు. మచిలీపట్నం బోడిరెడ్డిపల్లి గ్రూప్ గ్రేడ్-1 కార్యనిర్వాహణాధికారి అరుణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించామన్నారు. వేమవరం గ్రామస్థులు, సిబ్బంది హుండీల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారని ఈవో తెలిపారు.



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు



రైతులతో మాట్లాడుతున్న ఏవో బోలెం అనంతలక్ష్మి

ఆరబెట్టిన ధాన్యాన్నే మిల్లులకు తరలించాలి

గుడివాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాతే ఆర్‌ఎస్‌కేల ద్వారా మిల్లులకు తరలించాలని ఏవో బోలెం అనంతలక్ష్మీ తెలిపారు.మంగళవారం వలివర్తిపాడులో పోలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో ఆమె మాట్లాడుతూ వరి పంట అయ్యే దశలోనే మినుము విత్తనాలు చల్లుకోవాలని స్పష్టం చేశారు. మినుము విత్తనాలు నాలుగు కేజీల బ్యాగ్ చొప్పున రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. విబీఎన్ 8రకం, విబీఎన్ 9 రకం, విబీఎన్ 10 రకం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఒక్కొక్క రైతుకు ఒక్కో బ్యాగ్ చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఉచితంగా అందించే ఈ బ్యాగ్‌లను తమ పొలంలో మినుము విత్తనాలు చల్లుకోవాలని తెలిపారు. మినుము పైరు చక్కగా పెరగటానికి ముందుగా కలుపు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి రైతుకూ తగు సూచనలు, సలహాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై ప్రతిష్టంభన

● రోజు రోజుకూ పెరుగుతున్న ఆక్రమణలు
● పట్టించుకోని అధికారులు

(తోట్లవల్లూరు - ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు సెంటర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పీహెచ్‌సీ వరకు గల పంచాయతీ రోడ్డులో ఆక్రమణల తొలగింపు వ్యవహారం పలు రకాల మలుపులు తిరుగుతోంది. ఏప్రిల్ 25న సర్వే చేసి ఆక్రమణలను గుర్తించిన అధికారులు మళ్లీ వాటి జోలికి వెళ్లలేదు. దీంతో రోడ్డు అభివృద్ధికి నోచటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామస్థులు సోమవారం మచిలీపట్నం వెళ్ళి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం)లో ఫిర్యాదు చేయటం, అక్కడ నుంచి జేసీ మండల అధికారులకు ఫోన్ చేసి వివరణ అడగటంతో ఈ సమస్యకు ప్రాధాన్యత ఏర్పడింది. గత ఏప్రిల్లో రెవెన్యూ, పంచాయతీ అధికారులు సర్వేచేసి ఆక్రమణలను గుర్తించి సిమెంటు కాంక్రీట్‌తో హద్దులుగా దిమ్మెలను నిర్మించారు. స్థానికులు తమ నివాస గృహాలను రోడ్డును ఆక్రమించి నిర్మించుకున్నారని నాటి సర్వే అధికారులు నిర్ధారించి పటిష్టంగా కాంక్రీట్ దిమ్మెలు పోయించారు. మే నెలలో పూర్వపు ఇన్‌చార్జి కార్యదర్శి రవికుమార్ ఆక్రమణదారులకు మొదటి నోటీసులు అందించారు. ఆయన తరువాత వచ్చిన కార్యదర్శి రావి శ్రీనివాసరావు సెప్టెంబరులో రెండవ నోటీసులు అందించారు. కాని ఆక్రమణదారులు ఎవ్వరూ ఆక్రమణలను తొలగించుకోలేదు. దీంతో అక్టోబర్‌లో మూడవ నోటీసులు ఇచ్చే క్రమంలో కొందరు వ్యక్తులు తమకు ఇంజక్షన్ ఆర్డర్ ఉందని, అందుచేత ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అధికారులందరికి నకళ్లు పంపించారు. ఈ నేపథ్యంలో సోమవారం మాకినేని దశరధరావు, గన్నే రవి తదితరులు మచిలీపట్నం వెళ్లి పీహెచ్‌సీ రోడ్డు ఆక్రమణల అంశంపై మీ కోసంలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవటం లేదని అధికారులకు వారు వివరించారు. దీంతో జేసీ మండలాధికారులకు ఫోన్‌చేసి వివరణ అడిగినట్టు సమాచారం. ఆక్రమణలు తొలగింపు చేపడితే కొందరి భవనాల గోడలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆక్రమణలు తొలగిస్తే సీసీరోడ్డు నిర్మించేందుకు వీలుంటుందని స్థానికుల అంటున్నారు.



సర్వే తరువాత పీహెచ్‌సీ రోడ్డులో ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మె

'ఇంజక్షన్ ' ఉండటంతో ముందుకెళ్లలేదు



మూడవ నోటీసులు అందించే సమయంలో అక్టోబరు 14న పురంశెట్టి సాంబశివరావు, పురంశెట్టి శ్రీనివాసరావు ఆర్‌ఓవసీ నెం. 152/1980, ది. 02-03-1982 గల ఇంజక్షన్ ఆర్డర్ ఉందని నకళ్ల కాపీలను తనకు అందించారు. అలాగే మిగతా అధికారులకు పంపించినట్టు వారు తెలిపారు. దీంతో ఎలా ముందుకు వెళ్లాలో తెలియజేయమని న్యాయ సలహా కోరాను

రావి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి



రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుడివాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలన్నీ పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక గౌరీశంకరపురంలో రూ.99.09లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు, నూతన డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల భూమిపూజ నిర్వహించి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రధాన రహదారుల పనులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టీడీపీ నాయకులు దింట్యాల రాంబాబు, పాల్గొన్నారు.

మోడల్ షాదీఖానాగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ముస్లిం సోదరుల చిరకాల కోరిక షాదీఖానా నూతన భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తామని, 7వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మోడల్ షాదీఖానా భవన నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మంగళవారం స్థానిక షాదీఖానాను ఆయన పరిశీలించారు. పిచ్చి మొక్కలతో నిండిన షాదీఖానా ప్రాంగణాన్ని స్వయంగా జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నిధులు మంజూరు చేయించి,అందరికి సౌకర్యవంతంగా ఉండేలా 7వేల చదరపు అడుగుల్లో నూతన భవనం నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 48గంటల్లో జంగిల్ క్లియరెన్స్ చేయడానికి మైనార్టీ సోదరులందరూ స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి అబ్దుల్ రబ్బానీ, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మైనార్టీ నాయకులు షేక్ ఇబ్రహీం, షేక్ జానీ, సయ్యద్ జబీన్ ,పాల్గొన్నారు.



షాదీఖానాలోని పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల , తదితరులు

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

● ఎంఈవో రజని

గుడివాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు చదవటమేకాకుండా ఆరోగ్యం, క్రమశిక్షణ పాటించాలని ఎంఈవో రజని అన్నారు. మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించటానికి వివిధ పాఠశాలలు సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు ఏమైనా ఉన్నా చదువుతో వెనుకబడిన విద్యార్థులు భయపడవద్దని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 100 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ప్రతీ విద్యార్థికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రశాంతంగా కూర్చుని మాట్లాడి వారిలో ఉన్న భయాలు పోగొట్టాలని తెలిపారు. భయం పోతే చక్కగా చదువుకోవటమే కాకుండా మంచి ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని తెలిపారు. పదవ తరగతి జీవితంలో మలుపు అని, ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత శాతం మార్కులు పెంచుకుంటే ఇంటర్మీడియట్‌లో ఉచితంగా సీట్లు వస్తాయని తెలిపారు. క్రమశిక్షణతోపాటు అన్ని రకాల సబ్జెక్టులపై మంచి పట్టు ఉండాలని తెలిపారు. వంద రోజుల్లో నైపుణ్యాన్ని సాధించి మంచి ఉత్తీర్ణత సాధించి మండలంలో మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావటానికి పదవ తరగతి విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో-1 రజని

బాలుడికి ఆర్థిక సాయం

గుడ్లవల్లేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : పెంజండ్రలో పేద కుటుంబానికి చెందిన యశ్వంత్ అనే బాలుడికి పాఠశాలలో ప్రమాదవశాత్తు పడిపోయి చేతికి గాయాలై చేయి విరిగింది. గ్రామానికి చెందిన గుడ్లవల్లేరు వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్ తన సొంత నిధులు రూ. 5 వేలు వైద్యం ఖర్చులకు బాధితుడికి ఆర్థిక సాయం అందజేశారు.

ఎస్‌టీయూ కార్యవర్గం

గుడివాడ : ఎస్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గంలో గుడివాడకు చెందిన రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా డి.చంద్రశేఖర్, జిల్లా సంయుక్త అధ్యక్షుడిగా పి.వి.ఎన్.డి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పి.ప్రకాష్‌బాబు, డి.విజయ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఐ.అరవింద్, ఆర్థిక కమిటీ సభ్యురాలిగా ప్రియదర్శినిలు ఎంపికయ్యారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

కరాటే పోటీల్లో ఏఎన్ఎం విద్యార్థుల ప్రతిభ

పామర్రు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే చదువుతోపాటు కరాటే శిక్షణ పట్ల మక్కువ పెంచుకోవడం ద్వారా స్వీయ రక్షణకు దోహదపడుతుందని ఏఎన్ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ అన్నపురెడ్డి పూర్ణచంద్రారెడ్డి అన్నారు. ఈనెల 7న గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే చాంపియన్ షిప్‌లో -25 పోటీలో ఆ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో బహుమతులు సాధించారు. అండర్-14 విభాగంలో డీవీ కార్తీక్, సి.మణికంఠ, సీహెచ్ త్రినాథ్ షణ్ముఖ్‌లు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించారు. వీరితోపాటుగా మరో ఆరుగురు ద్వితీయ స్థానాల్లో విజేతలైన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్ పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో కోచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బొడ్డపాడులో ప్రారంభమైన డ్రెయినేజీ నిర్మాణ పనులు

రూ. 3 లక్షలతో సీసీ డ్రెయినేజీ నిర్మాణం

తోట్లవల్లూరు : బొడ్డపాడులో మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలతో చేపట్టిన సీసీ డ్రెయినేజీ పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ మూడే శివశంకర్ భూమిపూజ నిర్వహించారు. మురుగునీటి సమస్య లేకుండా డ్రెయినేజీ నిర్మాణం చేస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు, పీఏసీఎస్ ఛైర్మన్ నిమ్మగడ్డ వెంకటరత్నం, మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ సీతారాంబాబు, కార్యదర్శి డి.రమాదేవి, పాలకేంద్రం అధ్యక్షుడు వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన

గుడివాడ : విశాఖపట్నంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో నవంబరు 29,30 తేదీల్లో నిర్వహించిన జాతీయ ఇన్విటేషనల్ కరాటే పోటీల్లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి పలు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14సంవత్సరాలలోపు బాలుర వ్యక్తిగత కటా విభాగంలో కె.జి. వితేష్ ద్వితీయ, బాలికల వ్యక్తిగత కటా విభాగంలో బి.చాతుర్య ప్రథమ, కె.దేదీప్య ప్రథమ, జి.గ్నైనిక ద్వితీయ, టి.శాన్వి తృతీయ స్థానాలు సాధించినట్టు ఆయన తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్ ఎస్.వెంకటేశ్వరరావులను పాఠశాల ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తోట్లవల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెనమకూరు జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు మంచి ఫలితాలు సాధించేందుకు వీలుగా యుటిఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సీ న్యూ మోడల్ టెస్ట్ పరీక్షా పేపర్ల పుస్తకాలను మంగళవారం రిటైర్డ్ ఎంఈవో పి వెంకట్రామయ్య, ధనలక్ష్మీలు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ టెస్ట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని వెంకట్రామయ్య కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ నాగేశ్వరరావు, రిటైర్డ్ ఎంఈవో కె విశ్వమోహన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి. మనోహర్, మండల యూటీఎఫ్ కార్యదర్శి ఎం. విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వజ్రోత్సవ ఆహ్వాన , రిజిస్ట్రేషన్ లింకు ఆవిష్కరణ

● కొల్లి శ్రీనివాసరావు

గుడివాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాలలో 16,17,18 తేదీల్లో నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా వజ్రోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ, రిజిస్ట్రేషన్ లింకును ప్రారంభించినట్టు కళాశాల వజ్రోత్సవ కమిటీ ఛైర్మన్ కొల్లి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఆహ్వానపత్రికల ఆవిష్కరణ, రిజిస్ట్రేషన్ లింకు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదగా కళాశాల వజ్రోత్సవ వేడుకలను ప్రారంభించనున్నామన్నారు. 75సంవత్సరాల వజ్రోత్సవ స్థూపాన్ని మాజీ ఉప రాష్ట్రపతి పద్మవిభూషణ్ వెంకయ్యనాయుడు, నూతన భవనాన్ని నటుడు అక్కినేని నాగార్జున ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జనవరి 2026 నుంచి నూతన విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 16,17 తేదీల్లో డాక్టర్ సూరపనేని బలరామకృష్ణ సంస్మరణార్థం రక్తదాన శిబిరం, ధాత్రి సంస్థ ఆధ్వర్యంలో మూలకణ సేకరణ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నామన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌ఆర్‌కే ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న కళాశాల వజ్రోత్సవ కమిటీ సభ్యులు

ధాన్యాన్ని మద్దతు ధరకే విక్రయించుకోవాలి

● ఏడీఏ స్వర్ణలత



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ స్వర్ణలత

పామర్రు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌ఎస్‌కేల ద్వారా ధాన్యం విక్రయించుకుని మద్దతుధర పొందాలని పామర్రు వ్యవసాయ సహాయ సంచాలకురాలు బి.స్వర్ణలత సూచించారు. మండల పరిధిలోని ఉండ్రపూడి, పోలవరం గ్రామాల్లో మంగళవారం ఆమె ఏవో వి.శివనాగరాణితో కలసి రోడ్లపై రైతులు ఆరబోసిన ధాన్యపు రాశులను పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. 17శాతం తేమ వచ్చేవరకు ధాన్యం ఆరబెట్టుకుని విక్రయిస్తే ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర పొందవచ్చునని వివరించారు. దళారులను ఆశ్రయించవద్దని, అవసరమైన సంచులు, ముఠా, రవాణా ఖర్చులు సైతం ప్రభుత్వమే భరించి రైతన్నలకు మద్దతు ధర అందిస్తుందన్నారు. ఆర్‌ఎస్‌కేలో ఎవరైనా రైతులకు ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

● డాక్టర్ సీహెచ్.రాజేశ్వరి

కూచిపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొవ్వ పీహెచ్‌సీ పరిధిలోని 9 సచివాలయాల్లో ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సీహెచ్.రాజేశ్వరి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలకు, ఆశా వర్కర్స్, సచివాలయాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, అంగన్వాడీ కార్యకర్తలకు, వాలంటీర్లకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ చేయవలసిన విధులపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. 22, 23 తేదీల్లో ప్రతి ఇంటినీ సందర్శించి 0-5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి లక్ష్యాన్ని అధిగమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ, సూపర్‌వైజర్ బి.విజయకుమార్ పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న సీహెచ్.రాజేశ్వరి

ప్రజాప్రతినిధుల ఆస్తులకే రక్షణ లేదు

● షేక్ ఇబ్రహీం, షేక్ లతీఫున్నీసా

గుడివాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : పట్టణ నడిబొడ్డులో రూ.1.50కోట్లు విలువ చేసే తమ స్థలాన్ని కొంతమంది నకిలీ సర్వే నెంబర్లు వేసి, స్థలానికి ఇంటి పన్ను పేరును సైతం మార్చి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేశారని, తమ సొంత ఆస్తులకే రక్షణ లేకుండాపోయిందని మాజీ కౌన్సిలర్లు షేక్ ఇబ్రహీం, షేక్ లతీఫున్నీసాలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక నైజాంపేటలోని వారి స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ షాదీఖానా ఎదురుగా తనకు అమ్మమ్మ ద్వారా సంక్రమించిన ఆస్తులను అక్రమంగా ఇంటి పన్ను పేరును మార్చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లామని, వెంటనే స్పందించడంతో ఇంటిపన్ను పేరును తిరిగి తమ పేరుకు మార్చారన్నారు. అక్రమంగా తమ ఆస్తులను కాజేసేందుకు సహకరించిన అధికారుల వివరాలను బయటపెడతామన్నారు.

మినీ అంగన్వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్

పామర్రు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పామర్రు ఐసీడీఎస్ పరిధిలోని తొమ్మిది మినీ అంగన్వాడీ కేంద్రాలకు ప్రధాన (మెయిన్) అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రెడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించినట్లు పామర్రు సీడీపీవో ఇన్‌చార్జ్ బి.ఉషా మంగళవారం తెలిపారు. అప్‌గ్రేడ్ పొందిన కేంద్రాల కార్యకర్తలకు గౌరవవేతనం రూ.7వేలనుంచి, రూ.11,500లకు పెరగనున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయకుమారి, సత్యశ్రీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుడివాడ: స్థానిక ఆటోనగర్ రెండో రోడ్డులో మెకానిక్‌గా పనిచేస్తున్న బొమ్మలూరు శివారు గంగాధరపురానికి చెందిన బొబ్బరపల్లి రామకృష్ణకు ఇటీవల ప్రమాదంలో రెండు చేతివేళ్లు తెగిపోయాయి. ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికునికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు, అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, ఉపాధ్యక్షుడు బి.ఆంజనేయులు, నాయకులు మొహిద్దీన్, షేక్ రహ్మాన్ , రెడ్డి నాగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలంలోని రెండు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు. బొమ్మలూరులో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా, రూ. 5800లు నగదు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బిళ్లపాడు గ్రామంలో ఐదుగురు పేకాట ఆడుతుండగా, రూ.5320లు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుడివాడరూరల్: సెరిదింటకుర్రులో నందిగం రవికుమార్ (24) అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నట్లు మంగళవారం ఎస్సై చంటిబాబు తెలిపారు. నందిగం రవికుమార్ మూడు సంవత్సరాల క్రితం సెరిదింటకుర్రుకు చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకుని నివసిస్తున్నాడు. ఈ నెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు కడుపు నొప్పి భరించలేక విషం సేవించాడని తన కోడలు 5వ తేదీన ఫోన్ ద్వారా తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుడివాడ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ 8వతేదీన మరణించినట్లు మృతుడి తండ్రి నందిగం ఆదాము తెలియజేశాడు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

గుడివాడ : స్థానిక బేతవోలులోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ఎనిమిది, తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం, విలువలు, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ దండమూడి సీతారామస్వామి, జయలక్ష్మీ, చైర్మన్ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 670



జడ్జి నియామక పరీక్షలో స్నేహ ప్రతిభ

ఘంటసాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల గ్రామానికి చెందిన బండ్ల స్నేహ జడ్జి నియామక పరీక్షలో ప్రతిభను చాటారు. హైకోర్టు ప్రకటించిన ఫలితాల్లో జడ్జి పోస్టుకు ఆమె ఎంపికయ్యారు. ప్రస్తుతం మచిలీపట్నం మొబైల్ కోర్టు ఏపీపీగా పని చేస్తున్నారు. ఈమె ఎంపీపీ వేమూరి రజనికుమారి, దివంగత ప్రసాద్ దంపతుల రెండో కోడలు. ఈ సందర్భంగా భర్త నవీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు తదితరులు స్నేహకు అభినందనలు తెలియజేశారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వీసీ రాంజీ

ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న తరుణంలో విద్యార్థులు ఆర్థిక అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కెరాంజీ ఉద్బోధించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని విశ్వవిద్యాలయం కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం, ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, 58 శాఖలతో బ్యాంక్ సేవలందిస్తోందన్నారు. కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన సదస్సులో ది బ్యాంక్ ఈడీ రామకృష్ణారావు, డైరెక్టర్ ఆచార్య అంజయ్య, రెక్టార్ ఎంవి బసవేశ్వరరావు ప్రసంగించారు. బ్యాంక్ డైరెక్టర్ కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు.


సీసీ రహదారి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణకుమారి, డాక్టర్ డీఆర్కే ప్రసాద్, వైస్ ఎంపీపీ రాంబాబు, స్వప్న

ఎంపీ విజయేంద్రప్రసాద్ నిధుల మంజూరు

● శ్మశాన వాటికలో సీసీ రహదారి నిర్మాణం

చల్లపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యులు, ప్రముఖ సినీ రచయిత కె.వి.విజయేంద్రప్రసాద్ రాజ్యసభ సభ్యుని నిధుల నుంచి రూ.50 లక్షలు చల్లపల్లికి కేటాయించారు. నిధులను శ్మశాన వాటికల అభివృద్ధికి వినియోగించేలా నిర్ణయించగా, ఆ నిధుల్లో రూ.19 లక్షలతో దళితవాడ సమీపంలో హిందూ శ్మశానవాటిక రహదారి నిర్మాణానికి ప్రతిపాదించి అనుమతులుపొందారు. ఈ మేరకు 242 మీటర్ల మేర సీసీ రహదారిని నిర్మిస్తున్నుండగా, పనులను ప్రారంభించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ చల్లపల్లి రథసారథి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, పైడిపాముల స్వప్న సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను పర్యవేక్షించారు. పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, విశ్రాంత ఏఈ వేముల శేషగిరిరావు, పైడిపాముల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించకపోతే కఠిన చర్యలు

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ షహనా బేగం మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి చర్యలు చేపట్టామన్నారు. తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో కె.మరియ కుమారి, ఏడీఏ జయప్రద, హార్టికల్చర్ అధికారి రమేష్, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాల డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.


ఆత్మరక్షణపై శిక్షణ పొందుతున్న బాలికలు

ఆత్మరక్షణపై బాలికలకు శిక్షణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ని 184 పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణపై శిక్షణ ఇస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కుముదినిసింగ్ తెలిపారు. చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో ఆత్మరక్షణపై శిక్షణను మంగళవారం కుముదిని సింగ్ పర్యవేక్షించారు. బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీసీడీవో సీతామహాలక్ష్మి, సెక్టోరల్ ఆఫీసర్లు పద్మజ, ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న ఆటో కార్మికులు

ఆటోస్టాండ్‌కు స్థలం కేటాయించాలి

మోపిదేవి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు స్టాండ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని జిల్లా కార్యదర్శి పోలినాయుడు డిమాండ్ చేశారు. మోపిదేవిలో ఆటో కార్మికులతో కలసి ప్రస్తుతం ఉన్న ఆటోస్టాండ్‌ను పరిశీలించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా స్టాండ్‌ను తొలగించాలని ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేయటంతో అసలే అంతంత మాత్రమే ఉంటున్న ఆటో కార్మికుల జీవనం, ఆటోస్టాండ్ తొలగిస్తే మరింత దుర్భరం అవుతుందన్నారు. ఆటో కార్మికులకు స్టాండ్ స్థలాన్ని కేటాయించి, రక్షణ కల్పించాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి సిహెచ్.రాజశేఖర్, ఆరేపల్లి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ఉపాలయం ఆంజనేయస్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ధన్వంతరాచారి ఆధ్వర్యంలో విశేష అలంకరణ చేయగా, భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల జాప్యం..రైతన్న ఆందోళన

కోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలులో రైస్‌మిల్లర్లు జాప్యం చేయటంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. తేమశాతం 17 ఉంటే రూ.1780లకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, మండలంలో అమలు కావటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. యారారెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు మద్దతు ధరకు కొనుగోలు చేస్తారని ధాన్యాన్ని ఆరబెట్టి రైతు సేవా కేంద్రాల వద్దకు తీసుకువెళ్తే మిల్లర్లు తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయటం లేదని అధికారులు తెలిపారన్నారు. ఈ విషయమై ఇటీవల జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందించినప్పటికీ, నేటి వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని రైతు రామాంజనేయులు వాపోయాడు. ఇప్పటికైనా తేమశాతం తక్కువ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మిల్లర్లు కొనుగోలు చేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


పదిరోజులుగా ఆరబెట్టిన ధాన్యాన్ని చూపుతున్న రైతు


పన్నుల చెక్కును అందజేస్తున్న వెంకటేశ్వరరావు

తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు

నాగాయలంక : తేమ శాతంతో పని లేకుండా బేషరతుగా రైతుల నుంచి ధాన్యం తీసుకుంటున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు చెప్పారు. మార్కెట్ సెస్ ద్వారా వచ్చిన రూ.6,42,400 చెక్కును మంగళవారం ఎంపీడీవో కె.ఎం.చంద్రశేఖరరావు, రేమాలవారిపాలెం పంచాయతీ కార్యదర్శి ఎం.జాహ్నవిలకు ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అందజేశారు. కొల్లూరి మాట్లాడుతూ, రైతు సేవా కేంద్రం అధికారులు, వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తేమ, నాణ్యత పేరుతో రైతులను నష్టాలకు గురి చేయొద్దని వెంకటేశ్వరరావు అధికారులకు హితవు పలికారు.

మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ఏఎంసీ చైర్మన్ వినతిపత్రం


మార్కెటింగ్‌శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ తులసీరావు

బంటుమిల్లి : మల్లేశ్వరం మార్కెట్టు యార్డు పరిధిలోని రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ జి.విజయ సునీతకు మల్లేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఓడుగు తులసీరావు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ సంచాలకుల కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం రైతు బంధు పథకం, లింకు రోడ్ల అభివృద్ధి, మార్కెట్ కమిటీ గ్రేడ్ పెంపు, రైతు బజార్ల ఏర్పాటు అంశాలను ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రజా దర్బార్ నేడు

నాగాయలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజాదర్బార్ బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నాగాయలంకలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కెఎం.చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ ఈవోలు, కార్యదర్శులు పాల్గొంటారన్నారు. ప్రజలు సమస్యలు వినతిపత్రాల రూపంలో అందజేయాల్సిందిగా కోరారు

డాక్ అదాలత్ 26న

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 26న డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. తపాలా సేవల్లో లోపాలుంటే 26వ తేదీ ఉదయం 12 గంటలకు సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలా హాజరుకాలేనివారు ఈనెల 24వ తేదీ లోపు ఫిర్యాదులను రాతపూర్వకంగా మచిలీపట్నం పోస్టల్ సూపరింటెండెంట్, కార్యాలయానికి పంపవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 8465843961కు ఫోన్ చేయవచ్చన్నారు.

పాఠశాల ముంపు సమస్యకు పరిష్కారం

● మల్లంపూడి పంచాయతీకి ఉపాధ్యాయుల ఫిర్యాదు
● పోలీసు, రెవెన్యూ సహకారంతో ఆక్రమణల తొలగింపు
● మురుగు నీరు పోయేందుకు డ్రెయినేజీ తవ్వకం


మురుగు పోయేందుకు డ్రైనేజీ తవ్విస్తున్న రెవెన్యూ, పోలీసులు అధికారులు

బంటుమిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మల్లంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ముంపు సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. మురుగునీరు వెళ్లే మార్గాన్ని స్థానికులు ఆక్రమించి పూడ్చివేయడంతో పాఠశాల ముంపునకు గురవుతోంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా, రెవెన్యూ, పోలీసు అధికారులు రంగంలోకి ఆక్రమణను తొలగించి డ్రెయినేజీ డ్రైనేజి తవ్వించారు. సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు గణేష్‌కుమార్, సత్యనారాణ దగ్గరుండి డ్రెయినేజీ తవ్వించడంతో సమస్య పరిష్కారమైంది. తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఆర్‌ఐ శంకర్, వీఆర్వో అశ్విని కుమార్, సెక్రటరీ జోత్స్న, పోలీసు సిబ్బంది సేవలను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.14.75 కోట్లు : మండలి

అవనిగడ్డ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని 35 కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.14.57 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బర్రంకుల రోడ్డుకు రూ.2.50 కోట్లు, ఉల్లిపాలెం - సాలెంపాలెం వయా వేణుగోపాలపురం రోడ్డుకు రూ.2.48 కోట్లు, కోడూరు - విశ్వనాథపల్లి వయా నరసింహపురం రోడ్డుకు రూ.3.80 కోట్లు, రామకృష్ణాపురం - పాత ఉపకాలి రోడ్డుకు రూ.1.71 కోట్లు, కాజ - ఘంటసాల రోడ్డు వయా మల్లంపల్లి రోడ్డుకు రూ.1.98 కోట్లు, కొడాలి - శ్రీకాకుళం వయా గోగినేనిపాలెం రోడ్డుకు రూ.2.10 కోట్లు మం జూరైనట్లు వివరించారు.

పాఠశాలల్లో నాణ్యమైన భోజనం పెట్టాలి


పెందుర్రు పాఠశాలలో భోజనం రుచి చూస్తున్న కృష్ణకిరణ్

బంటుమిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణకిరణ్ అన్నారు. పెందుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చుశారు విద్యాశాఖ అధికారులు బేగం, వెంకటేశ్వరరావులు, ప్రధానోపాధ్యాయుడు నాగబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కృత్తివెన్ను :** పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణకిరణ్ అన్నారు. మండలంలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. కృత్తివెన్ను జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. భోజనం సరిగా లేకపోతే 9963985678 నెంబరుకు ఫోన్ చేస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** పోషక విలువలు గల ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యు డు జక్కంపూడి కృష్ణకిరణ్ అన్నారు. బల్లిపర్రు గురుకుల పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనం స్వయంగా వడ్డించి, నాణ్యత తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ రూతమ్మకు పలు సూచనలు చేశారు.

యోగాలో సత్తా చాటిన పురిటిగడ్డ విద్యార్థులు



చల్లపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పురిటిగడ్డ జడ్పీహైస్కూల్ ప్లస్ విద్యార్థులు యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్ - 2026 పోటీలకు ఎంపికయ్యారు. ఉయ్యూరులో జరిగిన పోటీ ల్లో ప్రత్తిపాటి మనోజ్, ప్రత్తిపాటి హర్షిత, అవుటుపల్లి ప్రదీప్, శుద్ధపల్లి వెంకట జగన్నాధ శర్మ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను శిక్షణ ఇచ్చిన యోగా మాస్టారు మేడేపల్లి నాగరాజును హెచ్‌ఎం కెబిఎస్.శర్మ, విద్యాకమిటీ చైర్మన్ ప్రశాంతి, ఉపాధ్యాలు అభినందించారు.

లాంగ్‌జంప్‌లో విజయకుమారికి రజిత పతకం



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన లాంగ్‌జంప్ పోటీల్లో మచిలీపట్నానికి చెందిన తోట విజయకుమారి రజిత పతకం సాధించింది. విజయకుమారిని చిలకలపూడి వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కరెడ్ల సుశీల, కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ లంకిశెట్టి నీరజ, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి అభినందించారు.

అమెరికాలో మంత్రి లోకేశ్‌ను కలిసిన గోవర్ధన్


మంత్రి లోకేశ్‌తో బొబ్బా గోవర్ధన్

అవనిగడ్డ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు అమెరికా పర్యటనలో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను శాన్‌ఫ్రాన్సిస్కోలో పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కూటమి అధికారంలోకి రావటంతోనే అభివృద్ధిని పట్టాలెక్కించిన మంత్రి నారా లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి నారా లోకేశ్ ఆరా తీయటంతోపాటు పార్టీని బలోపేతం చేసేందుకు గోవర్ధన్ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వాడపాలెం పీఏసీఎస్ సభ్యురాలు అడపా వెంకట రమణమ్మ ఇటీవల మృతి చెందింది. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ చేతుల మీదుగా వాడపాలెం పీఏసీఎస్ చైర్మన్ దారపురెడ్డి చంటి బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. గళ్ళా తిమోతి, గద్దం రాజు, చిలంకుర్తి విచ్చేశ్వరరావు, ఘంటసాల బుజ్జి, మాదాసు నాగరాజు, యానాదిరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



చల్లపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ సిబ్బందితో కలిసి చల్లపల్లిలోని మద్యం దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. బ్రాండ్ల రకా లు, వాటి కోడింగ్, రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘంటసాలలో ఉచిత వైద్యశిబిరం

ఘంటసాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) కింద ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వేమూరి ప్రమోద్, రేపల్లె సంజీవని హాస్పటల్ వైద్యులు డాక్టర్ ఎస్.చలపతి పరీక్షలు నిర్వహించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గ్రామసర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సువర్ణలత పాల్గొన్నారు.

భూమి ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

పెడన రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భూఆరోగ్య పరిరక్షణ తీసుకోవలసిన అంశాలపై బల్లిపర్రు గురుకుల పాఠశాల విద్యార్థులకు జిల్లా వనరుల కేంద్రం డీడీ జ్యోతి రమణి అవగాహన కల్పించారు.విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఏవో పద్మజారాణి మాట్లాడుతూ విద్యార్థులు ఇళ్ల వద్దనే కూరగాయలు పండించాలన్నారు. ఏడీ కె శ్రీనివాస రావు, ఏవో జెస్సీ, ప్రిన్సిపాల్ రూతమ్మ పాల్గొన్నారు.

మత్స్య ఉత్పత్తిదారుల ఆదాయం పెంచడమే లక్ష్యం

అవనిగడ్డ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మత్స్య ఉత్పత్తిదారుల నికర ఆదాయం పెంచటమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సంగమేశ్వరం గ్రామానికి చెందిన మెరైన్, ఫిషర్‌మెన్, కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వల్లభనేని భిక్షానికి మత్స్యసంపద యోజన పథకం కింద రూ.2.54 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మత్స్యశాఖ ఏడీ ప్రతిభ, ఎఫ్‌డీవో వానపల్లి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు నాయుడు సాంబశివరావు, కొక్కిలిగడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

ఘంటసాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల లో గిల్గాలు మినిస్ట్రీస్ 68వ వార్షికోత్సవంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. చిన్నారుల నృత్యాల ఆకట్టుకున్నాయి. కావూరి దేవమణి, కె.దైవ ప్రకాష్‌బాబులతో కలిసి పాస్టర్ బెంజిమెన్ శాస్త్రి కేక్ కటింగ్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు దానియేలు రాజు, నవీన్‌బాబు, సతీష్ పాల్, హనోకు, గొర్రెపాటి నరసింహారావు, చంటిబాబు, ప్రసాద్, మేరిమ్మ, ప్రమీల, జమన తదితరులు పాల్గొన్నారు.